సిగ్గును విడి దేశమ్ములు
ముగ్గును బోసుకొని యుద్ధములు జేయు తరిన్
దిగ్గన మోడీ మేల్కొన
తగ్గెను యక్సైజు భారతావని లోనన్ !!

(ప్రపంచ దేశాలు మానవత్వాన్ని మరచి గిరులు గీసుకొని యుద్ధాలు చేసుకుంటున్న వేళ కూడా మోడీ తన చాకచక్యంతో పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**చురక**

రాష్ట్రంలో మరో పార్టీ
రాజకీయ ముఖచిత్రం
అవినీతి అంటకుండా
అదిసాగునా పవిత్రం
అంగబలం అర్థబలం
అన్నుంటెనే పార్టీ పరుగు
ఏదోక్కటి లేకున్నా
ఎదుగలేక తెరమరుగు



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ ఆదివారం 29-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:178 పేజీలు:6 వెల: రూ.1/-


## యుద్ధం సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మార్చి 28:పశ్చిమాసియా లో ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు చేస్తున్న యుద్ధంతో ప్రపంచ దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పలు దేశాలను ఇంధన కొరత ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఈ క్రమంలో యుద్ధం విసురుతున్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం నొయిడా లో అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని ప్రధాని అన్నారు. అక్కడ నెల రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోందని చెప్పారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందని తెలిపారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ సంక్షోభం నుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి సమయాల్లో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంత తను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయవద్దని ప్రత్యర్థి రాజకీయ పార్టీలను కోరారు.

తమ ప్రభుత్వ విధానాలు దేశ ప్రయోజనాలకు, దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయని ప్రధాని చెప్పారు. కాగా నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంటుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్‌లను అనుసంధానిస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌ను కూడా నిర్మించారు.

## మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం

హైదరాబాద్, మార్చి 28: తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

**తీర్మానాలు ఏకపక్షంగా ఆమోదించడం సరికాదు: హరీష్‌రావు**

అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. ఖనిజాలపై ఏటా ఆదాయం పెరుగుతోందని తెలిపారు. మైనింగ్ శాఖలో అనేక అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపించారు. తాను అన్ని ఆధారాలతోనే మాట్లాడుతున్నానన్నారు. తెలంగాణకు వచ్చే ప్రతి రూపాయిని కాపాడుకోవాలని కోరారు.

**ప్రభుత్వానికి ఎల్‌అండ్‌టీ విజ్ఞప్తి..**

నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్‌అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్‌అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో



పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది.

## చిన్నారుల కోసం 'తొలి ముద్ద' పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 28: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఆరు గ్యారంటీల పేరుతో సుపరిపాలన అందిస్తున్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండింటిని జోడెడ్లలా పరుగులు పెట్టిస్తున్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఏదో ఒక పథకాన్ని అమలు చేస్తున్నారు. తాజాగా.. అంగన్వాడీ చిన్నారులకు అల్పాహారం అందించేందుకు 'తొలి ముద్ద' పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఉప్మా, కిచిడీ మిక్స్‌ను చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్‌గా అందించనుంది ప్రభుత్వం.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ..'గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యమిచ్చారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రత ఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తోంది. అందుకే తాజాగా.. బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారంభించాం. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టింది' అని అన్నారు.

ఈ కార్యక్రంలో అంగన్వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు ముఖ్యమంత్రి. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం ఆదేశించారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామన్నారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా వారి సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అలాగే ఎల్బీ స్టేడియంలో లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఆటల పోటీలు నేడు, రేపు కొనసాగనున్నాయి. ఆదివారం రవీంద్ర భారతిలో కల్చలర్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

## కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన మంత్రి వాకిటి శ్రీహరి..

హైదరాబాద్, మార్చి 28: తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తాము పాల్గొనమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రమ్మంటు న్నామని ఎద్దేవా చేశారు. మైదానంలోకి తాము రామంటూ కేటీఆర్ అంటుంటే ఏం చేయగలమని అన్నారు. 'మావి వేరే గేమ్స్, కేటీఆర్‌వి మరో రకమైన గేమ్స్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు మంత్రి.

బీఆర్ఎస్ వాళ్లు ఆడే గేమ్స్ పెట్టడం సాధ్యం కాదు కదా? అంటూ చురకలు అంటించారు మంత్రి వాకిటి శ్రీహరి. తాము ఫిట్ తెలంగాణ కోసం ప్రయత్నం చేస్తున్నామని.. ఆరోగ్య తెలంగాణ ఉండాలని సీఎం ఆలోచన చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు డ్రగ్స్ వంటి ఆలోచనలు రాకుండా ఆటల వైపు మళ్లుతారని వాకిటి పేర్కొన్నారు. కాగా, నేటి నుంచి రెండ్రోజులపాటు జరిగే లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2026లో తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొనరంటూ ఎమ్మెల్యే కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రజా సమస్యలపై చర్చించకుండా క్రీడా పోటీలు అవసరమా? అంటూ ప్రశ్నించారు కేటీఆర్. శాసనసభ సమయం వృథా చేయడం తగదని.. కనీసం ఇంకో 10 రోజులు సమావేశాలను కొనసాగించాలని అన్నారు. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు. కాగా, ఈరోజు మధ్యాహ్నం హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా ప్రజాప్రతినిధులకు క్రీడా పోటీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## ఎల్బీ స్టేడియంలో ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం.. పాల్గొన్న సీఎం

హైదరాబాద్, మార్చి 28: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు.

'తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైంది. మా ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి. గ్రామీణ స్థాయిలో సీఎం కప్ స్పోర్ట్స్ నిర్వహించాం. లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే వివాదం చేశారు. మెస్సీ ప్రపంచ స్థాయి ఫుట్‌బాల్ దిగ్గజం. మెస్సీలాంటి ఆటగాడిని కాకుండా ప్రపంచ డ్రగ్ డీలర్‌ను పిలవాలా.. రాజకీయపరంగా విమర్శలు చేస్తే పట్టించుకోను. బీఆర్ఎస్ నేతలు క్రీడలను ఎందుకు బహిష్కరించారో చెప్పాలి' అని రేవంత్ రెడ్డి అన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు.

## ఎంత అడ్డుకోవాలని చూసినా ఆగదు.. ఇది దైవ కార్యం: సీఎం రేవంత్ రెడ్డి..



రంగారెడ్డి, మార్చి 28: రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్ట ఆగదని తేల్చి చెప్పారు. ఇవాళ(శనివారం) రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి?. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదు.

అడ్డంకులు వచ్చినా తగ్గేది లేదు..

శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారింది.

## రోడ్డు నిబంధనల పాటింపుతో ప్రమాదాలు దూరం : ఎస్ఐ గోపికృష్ణ

నల్గొండ, మార్చి 28:రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలకు దూరం ఉండొచ్చొని పెన్‌పహాడ్ ఎస్ఐ కాస్తాల గోపికృష్ణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు వాహనదారులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు, హెల్మెట్ తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను వెంట తీసుకెళ్లాలని చెప్పారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే డ్రైవింగ్ చేయాలన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడడం హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, నిద్రలేమి వంటి కారణాలతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూడదని చెప్పారు. అనంతరం నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

## 'కక్షిదారుల సత్వర న్యాయానికి లోక్ అదాలత్ దోహదం'

### -నల్లగొండ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు

### -పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసులు 13,338 పరిష్కారం




నల్గొండ, మార్చి 28:: కక్షిదారుల సత్వర న్యాయానికి లోక్ అదాలత్‌లు దోహదం చేస్తాయని నల్లగొండ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.నాగరాజు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో తీర్పు వస్తే తిరిగి అప్పీలుకు అవకాశం ఉండదన్నారు. నల్లగొండతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టులో వివిధ కోర్టులలో 16 బెంచీలలో సివిల్ కేసలు 20, క్రిమినల్ కేసులు 5,535, మోటర్ వాహన ప్రమాద బీమా కేసులు 156, ఇతర ప్రీ లిటిగేషన్ కేసులు 8,125, సైబర్ క్రైమ్ కేసలు 37 మొత్తం పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసులు 13,338 పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. అదే విధంగా ప్రమాద బీమా కేసుల్లో రూ.81,31, 0945 నష్ట పరిహారం బాధితులకు ఇప్పించినట్లు తెలిపారు. నల్లగొండలో నిర్వహించిన లోక్ అదాలల్‌లో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.పురుషోత్తంరావు, వివిధ కోర్టుల న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, కార్యదర్శి మంద నగేశ్, న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# సంగీత వాయిద్యాలకు భాషా భేదాలు ఉంటాయా !

## (29 మార్చి "ప్రపంచ పియానో దినం" సందర్భంగా)

అన్ని సంగీత వాయిద్యాల్లో రారాజుగా పియానోకు పేరుంది. గ్రెగోరియన్ క్యాలండర్‌లో 88వ రోజు, అనగా మార్చి 29న (పియానో వాయిద్యానికి 88 కీస్ ఉన్న కారణంగా) "ప్రపంచ పియానో దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. అన్ని వయస్సుల పినానో ప్రేమికులు, పియానో అభిమానుల ముందు పబ్లిక్ ప్రదేశాల్లో ఈ రోజున పియానో వాయించడం ఒక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 2015లో నిల్స్ ఫ్రామ్ చొరవతో ప్రపంచ పియానో దినం పాటించడం ప్రారంభమైంది. ప్రపంచ పియానో దినోత్సవం-2026 నినాదంగా "పియానో డే ; ప్లేసెస్" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

**పియానో ప్రయోజనాలు:**

1700 ఏడాదిలో "బార్టొలోమియో క్రిస్టొఫోరీ" కనుగొన్న పియానో కాలక్రమం తన ఆకారాన్ని మార్చుకుంటూ నేడు ఈ రూపంలోకి వచ్చింది. ఆనందం, వినోదం పంచడానికి పియానో వాయిద్యం వినియోగపడుతున్నది. పియానో వాయించడం లేదా పియానో వినడం వలన జ్ఞాపకశక్తి పెరగడం, చేతులు-నేత్రాల మధ్య సమన్వయం మెరుగుపడడం, మానసిక ఆందోళన లేదా ఉద్రేకం తగ్గడం జరుగుతుంది.

ప్రపంచ పియానో దినం రోజున ప్రముఖ పియానో వాయిద్యకారులు ఉచితంగా పియానో వాయిస్తూ సంగీతాభిమానులకు వీనుల విందు చేస్తారు. పియానో వాయిద్యానికి తోడుగా సంపోజర్స్, పెర్ఫామర్స్, పియానో ప్రేమికులు, ట్యూనర్స్, బిల్డర్స్ సమన్వయంతో సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ప్రపంచ పియానో దినం రోజున పియానో నేర్చుకోవడం మొదలు పెట్టడం, పియానో టీచర్స్‌ను సన్మానించడం లేదా కృతజ్ఞతలు చెప్పడం, బహిరంగ ప్రదేశాల్లో వాయించడం, పియానో సంగీత ప్రదర్శనలకు హాజరుకావడం, ఆన్‌లైన్‌లో పియానో సంగీతాన్ని ఆస్వాదించడం లాంటివి చేయవచ్చు.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# జీజీహెచ్‌లో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం




కర్నూలు, మార్చి 28:: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా, ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను స్థానిక గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల థీమ్ "జీరో వేస్ట్ ఇన్‌స్టిట్యూషన్స్" గా నిర్ణయించడంతో, ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్యంపై అవగాహన పెంపొందించే దిశగా విస్తృత కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆసుపత్రి క్యాజువల్టీ విభాగం నుండి ప్రారంభమైన భారీ అవగాహన ర్యాలీ గైనెక్ వార్డు వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు బ్యానర్లు ప్రదర్శిస్తూ "మన చెత్త - మన బాధ్యత" అనే నినాదాలతో రోగులు, వారి సహాయకుల్లో పరిశుభ్రతపై చైతన్యం నింపారు. ర్యాలీ అనంతరం గైనెక్ వార్డు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి పరిసరాలను పచ్చదనంతో నింపి, శుభ్రమైన, ఆహ్లాదకర వాతావరణం కల్పించడం లక్ష్యంగా ఈ ప్లాంటేషన్ చేపట్టారు. ఇదే సందర్భంలో ఎమర్జెన్సీ వార్డు ముందు తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర బయో-మెడికల్ వ్యర్థాలను వేర్వేరు రంగుల డబ్బాల్లో వేరు చేసి వేయడం యొక్క ప్రాముఖ్యతను నర్సింగ్ విద్యార్థులు, శానిటేషన్ సిబ్బంది ప్రజలకు ప్రత్యక్షంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. లక్ష్మి భాయి, ఆఫీటూ డా. పద్మజ, డిప్యూటీ ఆఫీటూ డా. పద్మజ, అడ్మినిస్ట్రేషన్ అధికారులు సింధు సుబ్రహ్మణ్యం, డా. వెంకట రమణ, డా. శివ బాల, డా. కిరణ్ కుమార్, డా. సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి భాయి తదితరులు పాల్గొన్నారు.

అలాగే నర్సింగ్ విద్యార్థినిలు, ఆసుపత్రి సిబ్బంది పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మార్కాపురం కలెక్టర్‌గా విజయ సునీత బాధ్యతలు స్వీకరణ



అమరావతి, మార్చి 28: మార్కాపురం జిల్లాకు మొదటి జిల్లా కలెక్టర్ గా నూతనంగా నియమితులైన ఎం. విజయ సునీత శనివారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా అధికారులతో కలిసి తన ఛాంబర్ లో కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజక వర్గాలతో కలిసి మార్కాపురం జిల్లాను ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన విషయం విధిత మే. ఇప్పటి వరకు ప్రకాశం కలెక్టర్ పి రాజబాబు ఇంచార్జ్ కలెక్టర్ గా వ్యవహరించారు.

ఇటీవల జరిగిన కలెక్టర్ ల బదిలీలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న విజయ సునీత ను నూతనం గా ఏర్పాటు చేసిన మార్కాపురం జిల్లా కలెక్టర్ గా నియమించడం తో శనివారం విజయ సునీత మార్కాపురం కలెక్టరేట్ లో మార్కాపురం మొదటి కలెక్టర్ గా బాధ్యతలు చేపటారు. నూతన కలెక్టర్ ను మార్కాపురం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, రెవిన్యూ డివిజన్ అధికారి ప్రభాకర్ తో పాటు పలువురు అధికారులు కలిసి స్వాగతశుభాకాంక్షలు తెలిపారు.

# యుద్ధం ఎఫెక్ట్.. తీవ్ర ఇంధన సంక్షోభంలో పాకిస్థాన్..

న్యూఢిల్లీ, మార్చి 28:యుద్ధం కారణంగా దాయాది దేశం పాకిస్థాన్ తీవ్ర ఇంధన సంక్షోభంలో చిక్కుకున్నది. పశ్చిమాసియా లో నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో అక్కడ లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. దేశవ్యాప్తంగా 11.67 కిలోల గ్యాస్ సిలిండర్ ధర.. పాకిస్థాన్ రూపాయల్లో ఏకంగా రూ.5,135 స్థాయికి పెరిగింది. పంజాబ్ ప్రావిన్స్ లో ఈ ధరల పెరుగుదల మరీ ఎక్కువగా ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు తెలుపుతున్నాయి.

గ్యాస్ ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఎల్‌పీజీతో నడిచే ఆటోలు, బస్సులు, మినీ బస్సుల రవాణా చార్జీలు పెరగడంతో తక్కువ, మధ్యతరగతి ఆదాయ వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మరోవైపు ఈద్, నౌరోజ్ సెలవుల కారణంగా ఇరాన్ నుంచి గ్యాస్ సరఫరా గణనీయంగా తగ్గింది. దాంతో సంక్షోభం మరింత తీవ్రమైంది. పాకిస్థాన్‌లో ఇంధన నిల్వలు కూడా ప్రమాదకర స్థాయిలో అడుగంటిపోయాయి. దేశంలో కేవలం 11 రోజులకు సరిపోయేంత మాత్రమే ముడి చమురు ఉంది.

అదేవిధంగా 27 రోజులకు సరిపోయే పెట్రోల్, 21 రోజులకు సరిపోయే డీజిల్, 9 రోజులకు సరిపోయే ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ పెట్రోలియం శాఖ కార్యదర్శి సెనేట్ కమిటీకి తెలిపారు. పాకిస్థాన్ తన పెట్రోలియం అవసరాల్లో దాదాపు 70 శాతం మధ్యప్రాచ్యం నుంచే దిగుమతి చేసుకుంటున్నది. ప్రస్తుత సంక్షోభంవల్ల సరఫరా మార్గాలు దెబ్బతిన్నాయి. సరఫరాలో అంతరాయాల కారణంగా ఏప్రిల్ 14 తర్వాత దేశంలో తీవ్రమైన గ్యాస్ కొరత ఏర్పడవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కాగా మార్చి నెలలో రావాల్సిన 8 ఎల్ఎన్‌జీ కార్గోలలో కేవలం రెండు మాత్రమే పాకిస్థాన్‌కు చేరాయి. హార్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు అనుమతి కోసం ఇరాన్‌తో పాకిస్థాన్ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. చర్చలు సఫలమైతే అక్కడి ప్రజలకు ఇంధన సంక్షోభం నుంచి కొంత ఉపశమనం లభించనుంది.

# బ్రిక్స్ తొలి యువజన సమన్వయ సమావేశం - 2026 నిర్వహించిన భారత్

న్యూఢిల్లీ, మార్చి 28:తొలి బ్రిక్స్ యువజన సమన్వయ సమావేశం - 2026ను యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని యువజన వ్యవహారాల విభాగం వర్చువల్ విధానంలో నిర్వహించింది. 2026 మార్చి 25 సాయంత్రం 4:30 నుంచి 6:00 (ఐఎస్‌టీ) వరకు జరిగిన ఈ కార్యక్రమానికి అన్ని బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.

2026 ఏడాదికి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టిన నేపథ్యంలో "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తంతో కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించింది. ఇది ఈ ఏడాది యువజన సహకారానికి దిశానిర్దేశం చేస్తుంది.

సమావేశంలో బ్రిక్స్ యూత్ ట్రాక్ 2026 గురించి సమగ్రంగా భారత్ వివరించింది. దీనిలో కార్యాచరణ బృందాల సమావేశాలు, ఇతివృత్తాత్మక కార్యక్రమాలు, సర్వ్ బ్రిక్స్ స్వచ్ఛంద సేవా కార్యకలాపాలు, యువజన అభివృద్ధి వేదిక, యువజన మండలి సమావేశం, యువ సదస్సు, యువ మంత్రుల స్థాయి సమావేశం ఉన్నాయి.

సభ్య దేశాల మధ్య సహకారంలో ప్రధానాంశాలపై చర్చలు దృష్టి సారించాయి. వీటిలో విద్య, నైపుణ్యాలు, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, సామాజిక భాగస్వామ్యం, సమ్మిళితత్వం, ఆరోగ్యం, క్రీడలు, పర్యావరణం, సుస్థిరత, ఒకరి మతం గురించి మరొకరు తెలుసుకునేలా చర్చలు, యూత్ ఎక్స్ఛేంజ్ తదితరమైనవి ఉన్నాయి.

విస్తృతమైన నేపథ్య అంశాల పై సభ్య దేశాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చేలా చేయడానికి, బ్రిక్స్ యూత్ ట్రాక్ - 2026 పరిధిలో సహకారాన్ని బలోపేతం చేయడానికి అవసరమైన వేదికను ఈ సమావేశం అందించింది. ఇది భారత్ అధ్యక్షతన భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలకు బలమైన పునాదిని వేసింది.

# ఢిల్లీ పోలీసుల కోసం సురక్షిత కమ్యూనికేషన్లు, ముఖ గుర్తింపు, సైబర్ సెక్యూరిటీ, మరియు క్వాంటం సెక్యూరిటీ వంటి రంగాలను కవర్ చేసే సమగ్రమైన స్వదేశీ సాంకేతిక పరిష్కారాలను సి-డాట్

న్యూఢిల్లీ, మార్చి 28: భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ల శాఖ (ఆనీు) ఆధ్వర్యంలోని ప్రముఖ టెలికాం ఆర్‌డడి సంస్థ అయిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సి-డాట్), జాతీయ రాజధాని కోసం సాంకేతికత ఆధారిత, స్వదేశీ, మరియు సురక్షిత పోలీసింగ్ పరిష్కారాలను అభివృద్ధి చేసే దిశగా ఒక చారిత్రాత్మక అడుగు వేస్తూ ఢిల్లీ పోలీసులతో ఒక అవగాహన ఒప్పందం (ఓనీజ) కుదుర్చుకుంది.

ఈ వ్యూహాత్మక సహకారం యొక్క లక్ష్యం, సి-డాట్ యొక్క అత్యాధునిక, స్వదేశీ సాంకేతిక పరిష్కారాల పోర్ట్‌ఫోలియోను ఉపయోగించుకుని, ఢిల్లీ పోలీసుల కార్యాచరణ సామర్థ్యం, సురక్షిత కమ్యూనికేషన్లు, నిఘా, సైబర్ సెక్యూరిటీ, మరియు అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలను గణనీయంగా మెరుగుపరచడం. తద్వారా ప్రజా భద్రత మరియు శాంతిభద్రతల రంగంలో ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను బలోపేతం చేయడం.

ఈ అవగాహన ఒప్పందం ప్రకారం, ఆధునిక పోలీసింగ్ అవసరాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన తొమ్మిది అధునాతన పరిష్కారాలను అ-ఆూ అమలు చేస్తుంది. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ఫ్రాడ్‌ప్రో, అందుబాటులో ఉన్న డేటాబేస్‌లతో ఫోటోలను సరిపోల్చడం ద్వారా అనుమానితులు, తప్పిపోయిన వ్యక్తులు మరియు పదేపదే నేరాలు చేసేవారిని గుర్తించడానికి వీలు కల్పిస్తుంది. ఇది శాంతిభద్రతల విధులలో దర్యాప్తు ప్రక్రియలు, జనసమూహ పర్యవేక్షణ మరియు గుర్తింపు ధృవీకరణను బలోపేతం చేస్తుంది. అ-ఆూ యొక్క యూనిఫైడ్ కమ్యూనికేషన్ సొల్యూషన్ అయిన సంవాద్, ఒకరితో ఒకరు మరియు గ్రూప్ చాట్‌లు, ఆడియో/వీడియో కాల్‌లు మరియు అధికారిక డేటా షేరింగ్ కోసం ఒక సురక్షితమైన వేదికను అందిస్తుంది. ఇది సాధారణ కార్యకలాపాలు మరియు అత్యవసర పరిస్థితులలో యూనిట్లు, జిల్లాలు మరియు ప్రత్యేక శాఖల మధ్య సజావైన మరియు సురక్షితమైన సమన్వయాన్ని సాధ్యం చేస్తుంది.

దీనికి తోడుగా, కీలకమైన కార్యకలాపాల సమయంలో గోప్యత మరియు సమగ్రతను నిర్ధారించడానికి, సీనియర్ అధికారులు మరియు ఆపరేషనల్ బృందాల మధ్య సంవాద్ ప్రైమ్ అనే ప్రత్యేకమైన హ్యాండ్‌సెట్ ఆధారిత సురక్షిత మెసేజింగ్ వ్యవస్థను అమలు చేస్తారు.

బహుళ-కెమెరా యాక్సెస్, ప్రజెంటేషన్ షేరింగ్ మరియు సహకార వైట్‌బోర్డ్‌లను కలిగి ఉన్న సురక్షితమైన వెబ్-ఆధారిత వీడియో కాన్ఫరెన్సింగ్ పరిష్కారం అయిన అ-ఆూ విూట్, బ్రీఫింగ్‌లు, యూనిట్ల మధ్య సమన్వయం మరియు శిక్షణా సమావేశాలను సులభతరం చేస్తుంది. సి-డాట్ మిషన్ క్రిటికల్ సర్వీసెస్ ప్లాట్‌ఫామ్, ప్రజా భద్రత మరియు అత్యవసర కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన సురక్షితమైన, గోప్యమైన మరియు తక్కువ జాప్యంతో కూడిన కమ్యూనికేషన్‌లను సాధ్యం చేస్తుంది. ఇది భారీ స్థాయి కార్యక్రమాలు, విపత్తు ప్రతిస్పందన మరియు శాంతిభద్రతల పరిస్థితులలో క్షేత్రస్థాయి అధికారుల మధ్య నిజ-సమయ సమన్వయాన్ని నిర్ధారిస్తుంది. ముఖ గుర్తింపుతో పనిచేసే సి-డాట్ ఇంటెలిజెంట్ అటెండెన్స్ సిస్టమ్, కచ్చితమైన హాజరు నమోదు, ప్రాక్సీ మార్కింగ్‌ను నివారించడం మరియు సున్నితమైన పోలీస్ సంస్థలలో ప్రవేశ నియంత్రణను బలోపేతం చేయడం ద్వారా పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.

సి-డాట్ సెల్ బ్రాడ్‌కాస్ట్ సొల్యూషన్, మొబైల్ పరికరాలు మరియు పబ్లిక్ డిస్‌ప్లే సిస్టమ్‌ల ద్వారా భౌగోళికంగా లక్ష్యంగా చేసుకున్న కీలక హెచ్చరికల ప్రసారాన్ని సాధ్యం చేస్తుంది. ఇది ప్రజా నలహాలు, ట్రాఫిక్ హెచ్చరికలు, తప్పిపోయిన వ్యక్తుల నోటిఫికేషన్‌లు మరియు అత్యవసర హెచ్చరికలకు మద్దతు ఇస్తుంది.

సైబర్ సెక్యూరిటీ పరంగా, ఏఐ-ఆధారిత ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ ఆపరేషన్స్ ప్లాట్‌ఫామ్ అయిన త్రినేత్ర ఈఎస్‌ఓసి, ఎండ్‌పాయింట్‌లను పర్యవేక్షిస్తుంది, బలహీనతలను గుర్తిస్తుంది మరియు అసాధారణతలను కనుగొంటుంది. ఇది అంతర్గత ఎకోసిస్టమ్ మరియు ఇంటర్నెట్-ఫేసింగ్ సిస్టమ్‌లతో సహా ఢిల్లీ పోలీసుల ఐటీ మౌలిక సదుపాయాలను కాపాడుతుంది; అదే సమయంలో త్రినేత్ర 360 సైబర్ ఇంటెలిజెన్స్, బ్రాండ్ పర్యవేక్షణ, అటాక్ సర్ఫేస్ పర్యవేక్షణ మరియు ఏఐ-ఆధారిత డిజిటల్ రిస్క్ మేనేజ్‌మెంట్‌ను అందిస్తుంది. ఈ విస్తరణలో భాగంగా, సి-డాట్ యొక్క క్వాంటమ్-ఆధారిత సెక్యూరిటీ సొల్యూషన్స్, కాంపాక్ట్ ఎన్‌క్రిప్షన్ మాడ్యూల్ (సీఈఎం), క్వాంటమ్ సెక్యూర్ స్మార్ట్ వీడియో ఫోన్ (క్యూఎస్ఎస్‌విఐపి) మరియు క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్ (క్యూకేడీ)లతో సహా, ఢిల్లీ పోలీసు వాతావరణం కోసం భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే, క్వాంటమ్-నిరోధక సురక్షిత వాయిస్, వీడియో మరియు డేటా కమ్యూనికేషన్‌లను అందిస్తాయి.

# వైభవంగా సామూహిక వివాహాలు..



అమరావతి, మార్చి 28: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సామూహిక వివాహ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో నిరుపేద కుటుంబాలకు చెందిన 24 జంటలు ఒక్కటయ్యాయి. లోకకళ్యాణాన్ని సంకేతంగా సూచించే సీతారాముల కళ్యాణంతో పాటు జరిగిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, సేవాభావాల సమ్మేళనంగా నిలిచింది. రఘువీరారెడ్డి దంపతులు స్వయంగా ముందుండి ఉచితంగా వివాహాలు జరిపించడం ద్వారా ఆదర్శంగా నిలిచారు.

వివాహ వేడుకల్లో భాగంగా కొందరు వధూవరులు తమ సాంప్రదాయం ప్రకారం గుర్రాలపై ఊరేగింపుగా కళ్యాణ వేదికకు చేరుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా హెచ్.ఆర్. పాళ్యంకు చెందిన మంజునాథ్‌సంకమ్మ జంట గుర్రంపై రాక భక్తులను, గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. నంజవధూత స్వామిజీ సమక్షంలో రఘువీరారెడ్డి దంపతులు ప్రతి జంటకు నూతన వస్త్రాలు, మంగళసూత్రాలను అందజేశారు. అనంతరం వధూవరుల బంధుమిత్రులకు, భక్తులకు ఆలయ ప్రాంగణంలో భారీగా విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రఘువీరారెడ్డి మాట్లాడుతూ "1982లో మా పెదనాన్న స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీరామిరెడ్డి ప్రారంభించిన ఈ సేవా యజ్ఞాన్ని గత 44 ఏళ్లుగా నిరంతరాయంగా కొనసాగిస్తున్నాం. ఇప్పటివరకు 4,500 పైగా జంటలకు వివాహాలు జరిపించడం మాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది" అని తెలిపారు.

వివాహాల అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో రఘువీరారెడ్డి దంపతులు స్వయంగా కోలాటం ఆడి భక్తులను ఉత్సాహపరిచారు. పల్లె సంస్కృతిని ప్రతిబింబించే ఈ నృత్యం వేడుకకు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# సమీప భవిష్యత్తులో పక్షులను తిరిగి అడవిలో వదిలేందుకు ప్రణాళిక: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, మార్చి 28: కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్, తీవ్రంగా అంతరించిపోతున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ సంరక్షణలో ఒక ముఖ్యమైన మైలురాయిని ఈరోజు ప్రకటించారు. 'జంప్‌స్టార్ట్ అప్రోచ్' అని పిలువబడే ఒక వినూత్న సంరక్షణ చర్య ద్వారా, గుజరాత్‌లోని కచ్‌లో ఒక దశాబ్దం తర్వాత ఒక పక్షిపిల్ల జన్మించింది. ఈ ప్రయత్నానికి ఒక సంవత్సరం క్రితమే ప్రణాళిక రూపొందించబడింది. దీనిని పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ , రాజస్థాన్ మరియు గుజరాత్ రాష్ట్ర అటవీ శాఖలు మరియు వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సమన్వయం చేశాయి.దేశంలో గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ చేపట్టిన మొట్టమొదటి అంతర్రాష్ట్ర జంప్ స్టార్ట్ కార్యక్రమం ఇది, దీనిని గుజరాత్‌లో విజయవంతంగా అమలు చేశారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, గుజరాత్‌లోని కచ్ గడ్డి మైదానాలలో కేవలం మూడు ఆడవిలు మాత్రమే జీవించి ఉన్నాయి, దీనివల్ల అడవిలో ఫలదీకరణ చెందిన గుడ్డు ఉండే అవకాశం లేదు. పొదిగిన గుడ్డును కచ్‌లోని కావలసిన గూడు ప్రదేశానికి రవాణా చేయడానికి 770 కిలోమీటర్ల కఠినమైన రోడ్డు ప్రయాణం పట్టింది. రాజస్థాన్‌లోని సామ్ నుండి గుజరాత్‌లోని నలియా వరకు ఆటంకాలు లేని కారిడార్‌ను ఏర్పాటు చేసి, ఈ ప్రయాణాన్ని విరామం లేకుండా చేపట్టారు.

గుజరాత్‌తో సహా గ్రేట్ ఇండియన్ బస్టర్డ్‌ను దాని సహజ ఆవాసాలలో సంరక్షించడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2011లో ప్రాజెక్ట్ ఊహించారు మరియు దీనిని 2016లో లాంఛనంగా ప్రారంభించారు.

# గోదావరిఖని రెడ్డి భవన్ లో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

కరీంనగర్, మార్చి 28 గోదావరిఖని నగరంలోని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా సాగింది. కరీంనగర్‌లోని ప్రముఖ మెడికవర్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన సహకారంతో శనివారం నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మంది వరకు హాజరయ్యారు.

కాగా, ఆస్పత్రి జనరల్ ఫిజిషియన్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ ప్రకాష్ హాజరై షుగర్, బీపీ, ఈసీజీ, 2-డీ ఈకో తదితర విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి రోగ నిర్ధారణ చేసి మందులను పంపిణీ చేశారు.

ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ సామాజిక బాధ్యత కింద కోల్ బెల్టు ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికవర్ ఆస్పత్రిలో పండుగలు, సెలవులతో సంబంధం లేకుండా 24 గంటలు అన్ని వేళలా అన్ని రకాల మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు జగన్ మోహన్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కరుణాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చదువు సంస్కారం నైపుణ్యాలే విజయానికి సోపానాలు

**కెప్టెన్ మధుసూదన్ రెడ్,డి మాజీ ప్రిన్సిపల్ ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ కరీంనగర్.**




కరీంనగర్, మార్చి 28 ప్రతి విద్యార్థికి చదువు, ఆకర్షనీయ వ్యక్తిత్వం, నైపుణ్యాలు మాత్రమే ఉన్నత స్థాయికి ఎదగడానికి తోడ్పడతాయని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నిర్వహిస్తున్న 7-రోజుల ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా మధ్యాహ్న భోజనం విరామం అనంతరం మోటివేషనల్ టాక్‌లో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసి వాలంటీర్లు ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అందరూ ఉదయం ఐదు గంటల లోపే లేచి ×ఫైవ్ ఏఎం క్లబ్లో× చేరాలని పేర్కొన్నారు. ప్రతిరోజు ఏడు గంటలు మాత్రమే నిద్రపోవాలని, ఏడు గంటలకంటే తక్కువ నిద్రపోయినట్లయితే అనారోగ్య పాలవుతారని, 7:00 కంటే ఎక్కువగా నిద్రపోతే సోమరిపోతులవుతారని, శరీరం నిత్యం చైతన్యంగా ఉండాలంటే జీవనశైలి మార్చుకోవాలని, జీవనశైలి మార్చుకుంటేనే జీవితంలో అద్భుతమైన విజయాలు సాధించుకోవచ్చని సూచించారు. దినచర్యలో భాగంగా మన లైఫ్ స్టైల్ ఎల్లప్పుడు కూడా అందరికీ ఆదర్శనీయంగా ఉండే విధంగా, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పేదరికంలో పుట్టడం మన తప్పు కాదని, కానీ పేదవాడుగా ఉంటే మాత్రం మనదే తప్పని దాన్ని మన తరం బ్రేకప్ చేసి ఒక నూతన తరాన్ని సృష్టించాలని వాలంటీర్లను ప్రేరేపించారు. గౌరవంగా మనం సంపాదించిన రోజే పేదరికం పారిపోతుందని పేర్కొన్నారు. చదువు, సంస్కారం, నైపుణ్యాలు ఈ మూడు అంశాలు విజయానికి సోపానాలుగా మారి, వీరు ప్రపంచాన్ని జయించడానికి తోడ్పడతాయని విద్యార్థులను అద్భుతంగా ప్రేరణ గోల్పే ప్రసంగి ప్రసంగాన్ని ఇచ్చి, అద్భుతమైన పాటతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల హృదయాలను గెలుచుకున్నారు. తదనంతరం కెప్టెన్ మధుసూదన్ రెడ్డి గారిని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అంబాల శంకరయ్య, తెలుగు శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ డి ప్రకాష్ తదితర అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శాలువాతో సత్కరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు డాక్టర్ మధుసూదన్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ తప్పకుండా మీరు సూచించిన మార్గాన్ని మేము అనుసరిస్తూ విజయ దుందుభి మోగించి ప్రపంచ విజేతలలో ఒకరోజు ఒక పేజీని తెరుస్తామని మాట ఇచ్చారు. ఎన్ఎస్ఎస్ నాలుగవ యూనిట్ ప్రత్యేక శిబిరం ఐదవరోజు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పడాల తిరుపతి నేతృత్వంలో మోతే గ్రామం రామడుగు మండలంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించి, పోల్ టర్న్ అవుట్ పెంచాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మొదటి టీం ర్యాలీ నిర్వహించడం జరిగింది. అలాగే రెండవ టీం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మహిళా శిశు ఆరోగ్యం, రక్తహీనత, సీజనల్ వ్యాధుల గురించి ప్రజ ప్రజల్లో అవగాహన కల్పించారు. తదనంతరం గ్రామంలో రోడ్లను పరిశుభ్రంగా ఉడుస్తూ, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను చుట్టూ గుంతలు ఏర్పాటు చేసి నీటిని మొక్కలకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరురాలు శ్రీమతి బత్తిని భవాని ప్రవీణ్ గారు, ఉపసర్పంచ్ కుమ్మరి అనిల్ కుమార్, గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీ ఎస్ బాబి గారు, వార్డు మెంబర్లు శ్రీమతి ఆరేపల్లి సుమలత, శ్రీమతి దుర్గం జయసుధ, శ్రీమతి నేరేళ్ల స్రవంతి, శ్రీమతి మామిడిపల్లి భాగ్యలక్ష్మి, పూదరి శ్రీనివాస్, గజ్జల మౌనిక, చీకటి మల్లేశం మొదలైన వార్డు మెంబర్లు తమ తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. మోతే ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి లక్ష్మణ్ కుమార్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# టీడీపీ కుటుంబానికి సహాయం

అమరావతి, మార్చి 28: రాప్తాడు మండలంలోని మారూరు గ్రామనికి చెందిన తెలుగు దేశం పార్టీ కుటుంబ సభ్యులు బుడగ లక్ష్మీదేవి అనివార్య కారణాల వలన మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల ఇన్చార్జి ధర్మవరపు మురళి వెంటనే స్పందించి లక్ష్మీదేవి అంత్యక్రియలకు రూ.10000 సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం నుంచి అందే ప్రతి ఒక్క పథకాన్ని అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మరూరు పిఎసి ఎస్ చైర్మన్ గోపాల్ నాయుడు గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్లమూడి వేనకా దేవి వడ్లమూడి కేశవయ్య డీలర్ నారాయణస్వామి చీర్ల వెంకటేష్ కడితి రాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కు జిల్లా క్రీడాకారులు ఎంపిక

నిజామాబాద్, మార్చి 28: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయి ఎంపికలు శనివారం ఉదయం 9.30 గంటల నుంచి రాజారం స్టేడియం, నాగారం, నిజామాబాద్‌లో నిర్వహించారు. మండల స్థాయి ఎంపికల్లో 41 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారిలో 37 మంది విద్యార్థులు జిల్లా స్థాయి ఎంపికలకు హాజరయ్యారు. ఇందులో 27 మంది బాలురు, 10 మంది బాలికలు పాల్గొన్నారు. ఎంపికల సందర్భంగా విద్యార్థుల బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 610 పరుగు, ఎత్తు, బరువుల ఆధారంగా ప్రతిభను పరిశీలించి ఉత్తమంగా ప్రదర్శన కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు.

# వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ పునరుద్ధరించాలి..




అమరావతి, మార్చి 28: వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టాన్ని పునరుద్ధరించాలని, సత్వరమే కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు తో పాటు, మీడియా స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు కొత్త చట్టాలు తీసుకురావాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐ జేయూ) అధ్యక్షులు కె శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో జరిగిన ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దాదాపు రెండు దశాబ్దాలుగా జర్నలిస్టులకు వేతన సవరణలు జరగలేదని, దీంతో వారి పరిస్థితి అసంఘటిత రంగం కార్మికుల కంటే దారుణంగా మారిందని తెలిపారు.

రాజ్యాంగంలో 4 వ స్థంభంగా పిలిచే మీడియా నేడు ముక్కలు అయిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని కేంద్ర రద్దుచేసిందన్నారు. జర్నలిస్టులను దిగజార్చడానికే నేషనల్ మీడియా కౌన్సిల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో వర్కింగ్ జర్నలిస్టులకు ఎటువంటి ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. ఆర్ ఎన్ ఐ ను మార్చివేసి పి ఆర్ జి ఐ ను ఏర్పాటు చేసిందని అన్నారు. "బలమైన, స్వతంత్ర విధానం లేకుండా ప్రజాస్వామ్యం సజావుగా నడవదు.

దురదృష్టవశాత్తు, మీడియాను కేవలం నిర్లక్ష్యం చేయడమే కాకుండా, వ్యవస్థపూర్వకంగా నియంత్రిస్తున్నారు," అని ఆయన వ్యాఖ్యానించారు. పని గంటలు, నైట్ డ్యూటీ నియమాలు వంటి ప్రాథమిక అంశాలను యాజమాన్యాలు తరచుగా పట్టించుకోవడం లేదని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డిజిటల్ (సోషల్) మీడియా ఒత్తిడితో సాంప్రదాయ మీడియా క్షీణిస్తోందని, పత్రికలు, టీవీ ఛానళ్లు ప్రేక్షకాదరణ కోసం తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

న్యూఢిల్లీలోని యూఎన్ఐ కార్యాలయాన్ని ఇటీవల అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటనను ఆయన పెరుగుతున్న అసహనానికి ఉదాహరణగా పేర్కొన్నారు. "ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మరింత అధికారాలతో మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియాగా పునర్వ్యవస్థీకరించాలనే తీర్మానాన్ని ప్లీనరీ ఆమోదించింది," అని శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఐజేయూ ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్ము మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టుల పరిస్థితి దిగజారుతోందని, దాడులు, హత్యల వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు.

"దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా విధులు నిర్వహించే సమయంలో జర్నలిస్టులు తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. స్వేచ్ఛా భావ వ్యక్తీకరణపై అధికారుల అసహనం పెరుగుతోంది," అని అన్నారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వై. సత్యనారాయణ (సుజనా చౌదరి) సోషల్ మీడియా నియంత్రణలేమిపై ఆందోళన వ్యక్తం చేశారు. "సోషల్ మీడియా సరైన నియంత్రణలు లేకుండా యాంటీ-సోషల్ మీడియాగా మారుతోంది.

జర్నలిజం విలువల ఆధారంగా ఉండాలి. వార్తల నిజానిజాలను నిర్ధారించే విధానాలు అవసరం. నేను నియంత్రణకు మద్దతు ఇవ్వడం లేదు, కానీ సరైన మార్గదర్శకాలు అవసరం,'' అని తెలిపారు. విశాలాంధ్ర ఎడిటర్ ఆర్.వి. రామారావు మాట్లాడుతూ, మీడియా యాజమాన్యాల ఆధీనంలోకి వెళ్తోందని, స్వతంత్ర జర్నలిజాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. "భయపడి కాకుండా స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వతంత్ర మీడియాను బలపరచడానికి ఐజేయూ చర్యలు తీసుకోవాలి,'' అని సూచించారు. టిడిపి పార్లమెంటరీ పార్టీ లీడర్ ఎల్.

కృష్ణ దేవరాయలు కూడా సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా అంబటి అంజనేయులు, కె. అమర్‌నాథ్, ప్రేమనాథ్ భార్గవ్, మాణికొండ చలపతి రావు వంటి మరణించిన సీనియర్ జర్నలిస్టులకు ఐజేయూ నాయకులు పుష్పాంజలి ఘటించారు. సమావేశం ప్రారంభానికి ముందు కె. శ్రీనివాస్ రెడ్డి ఐజేయూ జెండాను ఆవిష్కరించారు.

ఐజేయూ సీనియర్ నాయకులు ఎస్.ఎన్. సిన్హా డి. అమర్, ఎం.ఎ. మజీద్, కొత్తగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి డి. సోమ సుందర్, అమర్ మోహన్ ప్రసాద్, వై. నరేందర్ రెడ్డి, డీఎస్ఆర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో వచ్చిన ప్రతినిధులను ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు స్వాగతించారు.

ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ కళాకారులు పల్లె నర్సింహా. పి చంద్రనాయక్, ఆర్ పిచ్చయ్య దేశభక్తి, చైతన్యపూరిత గీతాలను ఆలపించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు సిల్వెస్టర్ తన ప్రదర్శనతో అలరించగా, నగరానికి చెందిన యువ నర్తకులు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు.

# ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవటమే డబ్ల్యూటీఓ చట్టబద్ధతకు మూలం..

## డబ్ల్యూటీఓ ఎంసీ14లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, మార్చి 28:కామెరూన్‌లోని యావుండేలో జరుగుతున్న డబ్ల్యూటీఓ ఎంసీ 14 రెండో రోజు సమావేశంలో సంస్థాగత సంస్కరణలపై సభ్య దేశాల వాణిజ్య మంత్రులు చర్చించారు. ఈ సమావేశంలో భారత ప్రతినిధి బృందానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ నాయకత్వం వహించారు.

'గత ఆదేశాలతో నిర్ణయాధికారం' అంశంపై శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవటమే డబ్ల్యూటీఓ చట్టబద్ధతకు మూలమని స్పష్టం చేశారు. సమ్మతం లేని నిబంధనలకు కట్టుబడి ఉండాలా వద్దా అనే అంశం ఆయా దేశాల సార్వభౌమాధికారమని.. ఆ హక్కును డబ్ల్యూటీఓ విస్మరించకూడదన్నారు. ఏకాభిప్రాయం ద్వారా నిర్ణయం తీసుకోవటంలోని సవాళ్లను అధిగమించేందుకు పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవాల్సిన అవసరాన్ని భారత్ స్పష్టం చేసింది. ప్రస్తుత ప్రతిష్టంభన, దానికి గల మూలకారణాలను డబ్ల్యూటీఓ జాగ్రత్తగా సమీక్షించాలని భారత్ కోరింది. ఈ చర్చలు పారదర్శకంగా, సమ్మిళితంగా, సభ్య దేశాల నేతృత్వంలోనే జరగాలని స్పష్టం చేసింది. అంతర్గతంగా ముక్కలైన వ్యవస్థలో సమగ్ర బహుముఖ వాణిజ్య వ్యవస్థ అభివృద్ధి చెందటం సాధ్యం కాదని భారత్ హెచ్చరించింది.

'సమాన అవకాశాల కల్పన' అంశంపై మాట్లాడిన శ్రీ పీయూష్ గోయల్.. ఉరుగ్వే రౌండ్ నాటి అసమానతలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణాత్మక అసమానతల పరిష్కారానికి నూతన అంశాలను చేపట్టే ముందు, వ్యవస్థలో పేరుకుపోయిన వ్యత్యాసాలను సరిదిద్దేందుకు ఆహార భద్రత, పీఎస్‌హెచ్, పత్తిపై ఎస్ఎస్ఎం వంటి పెండింగ్ అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని భారత్ స్పష్టం చేసింది. వివాద పరిష్కార వ్యవస్థ నిరంతరం విఫలమవుతుండటంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. సమర్థవంతమైన తీర్పులు లేకపోతే, అమలు శక్తిని నిబంధనలు కోల్పోవటం వల్ల చిన్న ఆర్థిక వ్యవస్థలు తీవ్రంగా నష్టపోతాయని హెచ్చరించింది. వాణిజ్యపరమైన ప్రతీకార చర్యలను సమర్థించుకోవటానికి, దేశ చట్టబద్ధ స్వదేశీ విధానాలను అడ్డుకునేందుకు పారదర్శకతను ఆయుధంగా ఉపయోగించవద్దని భారత్ హెచ్చరించింది. బదులుగా, సభ్య దేశాలన్నింటికీ అర్థవంతమైన, నిరంతర సామర్థ్య పెంపుదలకు సహకారం అందించాలని, తద్వారా న్యాయంగా, సమర్థవంతంగా దేశాల బాధ్యతలను నిర్వర్తిస్తాయని తెలిపింది. ఉత్పాదక సామర్థ్య పెంపునకు, ఉపాధి కల్పనకు, ప్రపంచ వాణిజ్యంలో అర్థవంతమైన భాగస్వామ్యానికి సభ్య దేశాలకు సమాన అవకాశాలుండాలని భారత్ స్పష్టం చేసింది.

డబ్ల్యూటీఓ సంస్కరణల పారదర్శకతపై జరిగిన మినిస్టీరియల్ ప్లీనరీ సెషన్‌తో చర్చలు ముగిశాయి. ఈ సమావేశంలో వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. మరింత పటిష్టమైన సాక్ష్యాధారిత విశ్లేషణ, సమర్పించిన ప్రతిపాదనలు, మంత్రుల నిర్ణయాలతో కూడిన పద్ధతిలో నిర్ణీత కాలంలో పూర్తి చేసే వాణిజ్య సంస్కరణల ప్రక్రియను తిరిగి ప్రారంభించేందుకు భారత్ మద్దతిస్తుందని తెలిపారు. లాభాలను చేకూర్చే అంశాలను మాత్రమే ఎంచుకోవటాన్ని, ముందుగా నిర్ణయించుకున్న ఏకపక్ష వైఖరిని ప్రచారం చేయటాన్ని భారత్ వ్యతిరేకించింది. డబ్ల్యూటీఓ కమిటీల పాత్రకు అధిక ప్రాధాన్యతనిస్తూ.. ఆయా కమిటీల అనుభవాలు, క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించే విధానం ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించవచ్చని సూచించింది. బహుముఖ వాణిజ్య వ్యవస్థను దెబ్బతీసే పక్షపాత వాణిజ్య ఒప్పంద ధోరణులపై హెచ్చరిస్తూనే.. బహిరంగంగా, పారదర్శకతతో కూడిన, సమగ్రత గల, సభ్య దేశాల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్య సూత్రాలపై ఏకాభిప్రాయ ప్రక్రియ ఆధారపడి ఉండాలని శ్రీ అగర్వాల్ పిలుపునిచ్చారు.

ఎంసీ14 సమావేశాల రెండో రోజున.. అమెరికా, చైనా, కొరియా, స్విట్జర్లాండ్, న్యూజిలాండ్, కెనడా, మొరాకో, ఒమన్ దేశాల ప్రతినిధులతో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఎంసీ14 అజెండాతో పాటు ఆయా దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయటంపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి.

## అమరావతి రాజధాని ఆంధ్రుల ఆకాంక్ష..

**అప్పట్లో మూడు రాజధానులను వ్యతిరేకించాను.**
**అసెంబ్లీలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**

అమరావతి, మార్చి 28: అమరావతి రాజధాని ఆంధ్రుల ఆకాంక్ష అని, అప్పట్లో మూడు రాజధానుల నిర్ణయాన్ని తను వ్యతిరేకించానని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో సమావేశంలో అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై అసెంబ్లీలో శనివారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఏపీ భవిష్యత్తును నిర్ణయించే చారిత్రక తీర్మానం అమరావతి రాజధానికి చట్టబద్ధత అన్నారు. 2019 నుంచి 24 వరకు అప్పట్లో దురదృష్టవశాత్తు తను కూడా ఎమ్మెల్యేగా ఉన్నానని అన్నారు.

అప్పట్లో ఇదే సభలో మూడు రాజధానుల గురించి ప్రస్తావించగానే భస్మాసురుడు తన నెత్తిన తనే చెయ్యి పెట్టుకుని నాశనం అయిన చందంగా ఇది జగన్ పతనానికి దారి తెస్తుందని చెప్పానన్నారు. ఇదిలా ఉంటే మూడు రాజధానులు అంశంపై జగన్మోహన్ రెడ్డి నివాసంలో కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్యేలు, ప్రముఖులతో జరిగిన సమావేశంలో కూడా తాను ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించానని అన్నారు. అమరావతిని చంపటం సరైన నిర్ణయం కాదని, ఇది వైసీపీని తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించినట్లు వివరించారు.

2018లో కూడా వైసీపీలో చేరేముందు కూడా జగన్మోహన్ రెడ్డి అమరావతి రాజధానిలో మార్పు లేదని తను ఇల్లు ఇక్కడే కట్టుకుంటున్నానని, చంద్రబాబు కే ఇక్కడ సొంత ఇల్లు లేదని చెప్పారన్నారు.

దీన్ని తను ఆ సమావేశంలో ప్రస్తావించగా అంబటి రాంబాబు కూడా జగన్మోహన్ రెడ్డి ఇంట్లో ఉండి ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తావా..అని తనను వారించినట్లు పేర్కొన్నారు. మల్లాది విష్ణు కూడా తన నిర్ణయాన్ని ఏకీభవిస్తున్నట్లు సమర్థించారని అన్నారు.

ఇదే సమావేశంలో ఇప్పటి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మంత్రి పార్థసారథి కూడా ఉన్నారని గుర్తు చేశారు. అమరావతిని రాజధానిని తరలించడానికి ససేమిరా అంగీకరించనని తన నిర్ణయాన్ని ఖరాఖండిగా తేల్చి చెప్పినట్లు స్పష్టం చేశారు.

# అమరావతే శాశ్వత రాజధాని



**-బీజేపీ సంపూర్ణ మద్దతు**
**-2019లో వైరస్ పీడించింది**
**-ఆయన మాట్లాడితే**
**-నల్లమల భస్మీపటలం**
**-వైఎస్ జగన్ పై మంత్రి సెటైర్**
**-మధ్యలో అత్తారింటికి దారేది కథ**
**-సీఎం సహా సభ్యుల నవ్వుల జల్లు**

అమరావతి, మార్చి 28:రాష్ట్రంలో మళ్లీ 12 ఏళ్ల తరువాత రాష్ట్ర రాజధాని అమరావతి చట్టబద్ధత గురించి చర్చించాల్సి రావడం దురదృష్టకరమని భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రత్యేకంగా శనివారం జరిగిన రాష్ట్ర శాసనసభలో మంత్రి మాట్లాడుతూ చారిత్రాత్మక తీర్మానానికి సంపూర్ణ మద్దతును బీజేపీ తరపున తెలియచేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి సత్యకుమార్ ప్రసంగం సూటిగా. స్పష్టంగా భావో ద్వేగంతో గత వైసీపీ పాలనలోని దురాగతాలను ఎండగడుతూ మంత్రి సత్యకుమార్? యాదవ్? ప్రసంగం సాగింది.

"ఈరోజు సంతోషకరమైన రోజు. దురదృష్టకర రోజు కూడా అని భావిస్తున్నా. అమరావతి కులాలు, మతాలకు పరిమితమైన రాజధాని కాదు ప్రాంతాలకు అతీత రాజదాని భవిష్యత్తులో ఎవరైనా విధ్వంసకర, వికృత, వినాసకర మనస్తత్వం కలిగిన వారి వల్ల ఎటువంటి అడ్డంకులు రాకుండా ఉండేందుకు చట్టబద్ధంగా తీర్మానం చేయాలని సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవడం సంతోషాన్ని కలిగిస్తోంది. దురదృష్టకరమైన రోజు అని ఎందుకు అన్నానంటే 12 ఏళ్ల కిందట 20వేల మంది రైతులు 33వేల ఎకరాలను పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందకుండా రాజధాని నిర్మాణానికి గొప్ప మనసుతో ఉదారత్వంతో అప్పగించారు. సీఎం. చంద్రబాబునాయుడు లక్ష్యం మేరకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తూ విద్యా సంస్థలు, ఇతర సంస్థలను కేంద్రం మంజూరుచేసింది. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలు సైతం అమలుచేస్తున్నారు పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టు కింద ప్రకటించి 100% నిదులను కేంద్రం ఇస్తోంది. అమరావతికి గ్రోత్ ఇంజన్ గా ఉండేందుకు 189 కిలోమీటర్ల అవుటర్ రింగు రోడ్డు నిర్మాణానికి కేంద్రం ముందుకొచ్చింది.

2019లో ఓ వైరస్ రాష్ట్రానికి వచ్చింది నాటి పాలనలో విధ్వంసకర, వినాసకర నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి ఘోరంగా దెబ్బతినింది. దేశ ప్రధాని మోదీ 2015లో అమరావతి రాజధాని నిర్మాణానికి భూమి పూజచేస్తే నాటి వైసీపీ ప్రభుత్వ పెద్దలు మూడు రాజధానుల పేరుతో వికృత, రాక్షస క్రీడకు శ్రీకారంచుట్టారు. సీఆర్డీఏ చట్టాన్ని వెనక్కు తీసుకున్నారు. శాసనసభలో అమరావతికి మద్దతు పలికి, నమ్మబలికి అధికారంలోనికి వచ్చిన అనంతరం యూటర్న్ తీసుకున్నారు. మూడురాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అభివృద్ధిని తొక్కేశారు. నాటి పాలకులు తడిగుడ్డతో రైతులు, ప్రజల గొంతు నులిమే ప్రయత్నంచేశారు కబ్జాలు, కక్షలతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యలకు తెగబడ్డారు. మహిళలు అని కూడా చూడకుండా దాష్టికాలకు పాల్పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి తాండవం చేసింది. 200 మంది వరకు రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే రైతులందరూ ఒక వర్గానికి చెందిన వ్యక్తులుగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేశారు ఆత్మహత్యలకు పాల్పడిన రైతులు బడుగు, బలహీనవర్గాల చిన్నసన్న కారు రైతులే. రాయలసీమలో హైకోర్టు బెంచీ కోసం కనీసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపలేదు. పుట్టిన రోజుల సందర్భంగా విభజన చట్టంలో ఉన్న స్టీల్ ప్లాంటు కోసం మూడుసార్లు భూమి పూజలు చేశారు. చేయాలి చెల్లి పెళ్లి..మళ్ళీ మళ్ళీ అన్న చందంగా వ్యవహరించారు.

# దళిత హక్కుల మహాసభల పోస్టర్ ఆవిష్కరణ..




నల్గొండ, మార్చి 28:దళిత కుల పోరాట సమితి రెండవ మహాసభ వాల్పోస్టర్ ను సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి 2వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 17, 18 తేదీలలో అబ్బుస్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి 2వ రాష్ట్ర మహాసభలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

అలాగే ఏప్రిల్ 17న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దండు లక్ష్మణ్ (సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి),

సంఘీం ఎలేందర్ (దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి), జన్ను రవి (జిల్లా అధ్యక్షులు), గుండె బద్రి (సీనియర్ నాయకుడు), ఆరే రాజు,మస్కా సుదీర్, తాళ్లపల్లి జాన్ పాల్, రాచర్ల రాజేందర్, జన్ను హరిబాబు, మంద నవీన్, బాణాల మహేశ్, రాజేష్, శ్వేత ,శైలజ తదితరులు పాల్గొన్నారు.

# సుమారు రూ. 11,200 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ తొలి దశను ప్రారంభించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, మార్చి 28:ఉత్తరప్రదేశ్‌లోని జెవార్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోషాన్ని, గర్వాన్ని వ్యక్తపరుస్తూ.. వికసిత్ యూపీ, వికసిత్ భారత్ అభియాన్‌లో నేడు నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. భారతదేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్, ఇప్పుడు అత్యధిక అంతర్జాతీయ విమానాశ్రయాలు గల రాష్ట్రాల్లో ఒకటిగా అవతరించిందని తెలిపారు. ఈ విమానాశ్రయానికి తానే శంకుస్థాపన చేసి, నేడు తానే ప్రారంభించటం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ప్రధానమంత్రి అన్నారు. ఈ భారీ విమానాశ్రయం పేరు ఉత్తరప్రదేశ్‌తో ముడిపడి ఉండటం మరో విశేషమని చెబుతూ.. "నన్ను ప్రతినిధిగా ఎన్నుకుని పార్లమెంటుకు పంపిన ఈ రాష్ట్ర గుర్తింపు, ఇప్పుడు ఈ అద్భుతమైన విమానాశ్రయంతో ముడిపడి ఉంది" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

ఈ కొత్త విమానాశ్రయం వల్ల విస్తృత ప్రయోజనాలు ఉన్నాయని వివరిస్తూ.. ఆగ్రా, మథుర, అలీగఢ్, ఘజియాబాద్, మీరట్, ఎటావా, బులంద్‌షహర్, ఫరీదాబాద్ వంటి సువిశాల ప్రాంతాలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రధానమంత్రి తెలిపారు. ముఖ్యంగా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని రైతులు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, యువతకు నూతన అవకాశాలను తీసుకువస్తుందని ఆయన స్పష్టం చెప్పారు. "ఇక్కడి నుంచి ప్రపంచ దేశాలకు విమానాలు వెళ్తాయి. ఈ విమానాశ్రయం అభివృద్ధి చెందిన ఉత్తరప్రదేశ్ కు ప్రగతి చిహ్నంగా మారుతుంది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా పశ్చిమ యూపీ వాసులకు శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులపై మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో నెల రోజులుగా జరుగుతున్న యుద్ధం పట్ల యావత్ ప్రపంచం ఆందోళనలో ఉందని ప్రధానమంత్రి అన్నారు. దీనివల్ల అనేక దేశాల్లో ఆహారం, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల వంటి నిత్యావసర వస్తువుల సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. భారత్ కూడా ఆ సంక్షోభ ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో ముడి చమురు, గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటోందన్నారు. "ఈ సంక్షోభ భారం సామాన్య కుటుంబాలు, రైతులపై పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

ప్రపంచ సంక్షోభ సమయాల్లోనూ భారత్ వేగవంతమైన అభివృద్ధిని కొనసాగిస్తోందని ప్రధానమంత్రి తెలిపారు. కేవలం పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోనే కొన్ని వారాల్లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయని, ఇది నాలుగో ప్రధాన ప్రాజెక్టు అని వెల్లడించారు. "ఈ స్వల్ప కాలంలోనే నోయిడాలో ఒక భారీ సెమీకండక్టర్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగింది. దేశంలోనే మొదటి ఢిల్లీ–మీరట్ నమో భారత్ రైలు ప్రారంభమైంది. మీరట్ మెట్రో విస్తరణ, నేడు నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం జరిగింది" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

యూపీ అభివృద్ధిలో ఈ అద్భుతమైన విజయాలకు ప్రస్తుత ప్రభుత్వమే కారణమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సెమీ కండక్టర్ ఫ్యాక్టరీ సాంకేతిక రంగంలో భారతదేశాన్ని స్వావలంబన దేశంగా మారుతుందని.. మీరట్ మెట్రో, నమో భారత్ రైలు వేగవంతమైన, స్మార్ట్ అనుసంధానతను కల్పిస్తుందని.. జెవార్ విమానాశ్రయం ఉత్తర భారత దేశం మొత్తాన్ని ప్రపంచంతో అనుసంధానిస్తోందని వివరించారు. "నేడు ఈ ప్రభుత్వ హయాంలో నోయిడా నగరం యూపీ అభివృద్ధికి శక్తిమంతమైన ఇంజిన్‌గా మారుతోంది" అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

ఈ విమానాశ్రయ ప్రాజెక్టు చరిత్రను వివరిస్తూ, జెవార్ విమానాశ్రయానికి అటల్ బిహారీ వాజ్‌పేయి 2003లోనే ఆమోదం తెలిపారని ప్రధానమంత్రి గుర్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దీన్ని నిర్లక్ష్యం చేశాయని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, నిర్మాణాన్ని పూర్తి చేసి, నేడు కార్యకలాపాలను ప్రారంభించిందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

ఈ ప్రాంతం లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, రెండు ప్రధాన సరకు రవాణా మార్గాలకు కేంద్రంగా మారుతోందని ప్రధానమంత్రి తెలిపారు. ఈ ప్రత్యేక రైల్వే మార్గాలు ఉత్తర భారతదేశానికి బెంగాల్, గుజరాత్ సముద్ర తీరాలతో అనుసంధానాన్ని పెంచాయని పేర్కొన్నారు. దాద్రి వద్ద ఈ రెండు కారిడార్లు కలుస్తాయని, దీనివల్ల ఇక్కడి రైతులు పండించే పంటలు, పరిశ్రమల ఉత్పత్తులు రహదారి, విమానయాన మార్గాల ద్వారా ప్రపంచంలోని ప్రతి చోటుకి వేగంగా చేరుకుంటాయని చెప్పారు. "ఇటువంటి సమగ్ర అనుసంధానత ఉత్తరప్రదేశ్‌ను ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ప్రధాన ఆకర్షణగా మారుస్తోంది" అని పీఎం మోదీ వివరించారు.

మారుతున్న ఈ ప్రాంత రూపురేఖల గురించి ప్రస్తావిస్తూ.. "నేడు యావత్ ప్రపంచాన్ని ఆహ్వానించటానికి నోయిడా సిద్ధంగా ఉంది. ఈ ప్రాంతమంతా ఆత్మనిర్భర్ భారత్ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తోంది" అని ప్రధానమంత్రి అన్నారు.

ఈ ప్రాజెక్టు సాకారానికి భూములను త్యాగం చేసిన రైతులకు ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికున్న ప్రాముఖ్యతను వివరించారు. ఆధునిక అనుసంధానతను విస్తరించటం వల్ల పశ్చిమ యూపీలో ఆహార శుద్ధి రంగం మరింత పుంజుకుంటుందన్నారు. "ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులు ఇప్పుడు ప్రపంచ మార్కెట్లకు మరింత వేగంగా చేరుకుంటాయి" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

ముడి చమురుపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించటంలో చెరకు రైతులు చేస్తున్న కృషిని ప్రధానమంత్రి అభినందించారు. చెరకు నుంచి ఉత్పత్తి అయ్యే ఇథనాల్ ప్రాముఖ్యతను వివరించారు. ఇథనాల్ ఉత్పత్తి పెరగకపోయినా, దాన్ని పెట్రోల్‌లో కలపకపోయినా.. ఏటా అదనంగా నాలుగున్నర కోట్ల బ్యారెళ్ల ముడి చమురును, అంటే దాదాపు 700 కోట్ల లీటర్లను భారత్ దిగుమతి చేసుకోవాల్సి వచ్చేదని ప్రధానమంత్రి తెలిపారు. "ప్రపంచ సంక్షోభ సమయంలో మన రైతుల కష్టం దేశానికి భారీ ఉపశమనాన్ని కలిగించింది" అని శ్రీ నరేంద్ర మోదీ కొనియాడారు.

ఇథనాల్ వినియోగం దేశానికే కాకుండా రైతన్నలకు కూడా ఎంతో మేలు చేసిందని, దీనివల్ల సుమారు రూ. 1.5 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అయిందని ప్రధాని వివరించారు. గతంలో చెరకు రైతులు తమ బకాయిల కోసం ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని గుర్తు చేశారు. "నేడు ప్రస్తుత ప్రభుత్వ కృషి వల్ల చెరకు రైతుల పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది" అని ప్రధానమంత్రి శ్రీ మోదీ స్పష్టం చేశారు.

విమానాశ్రయాలు కేవలం సౌకర్యాలు మాత్రమే కాదని, ప్రగతికి చోదక శక్తులని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశ విమానయాన మౌలిక సదుపాయాల విస్తరణను ఆయన ప్రస్తావించారు. నేడు దేశంలో 160కి పైగా విమానాశ్రయాలు ఉన్నాయని, విమాన ప్రయాణం కేవలం మహా నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలకు కూడా చేరుతోందని చెప్పారు. "ప్రస్తుత ప్రభుత్వం విమాన ప్రయాణాన్ని సామాన్య భారతీయుడికి అందుబాటులోకి తెచ్చింది" అని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో విమానాశ్రయాల సంఖ్యను పదిహేడుకు పెంచినట్లు తెలిపారు.

ఉడాన్ పథకం ప్రభావాన్ని వివరిస్తూ.. విమానాశ్రయాలు నిర్మించడమే కాకుండా, విమాన ప్రయాణ ఛార్జీలు సాధారణ కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధానమంత్రి అన్నారు. ఉడాన్ పథకం కింద టిక్కెట్లు బుక్ చేసుకుని కోటి అరవై లక్షల మందికి పైగా పౌరులు తక్కువ ధరలకే విమాన ప్రయాణం చేశారని పేర్కొన్నారు. "ఇటీవలే కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 29,000 కోట్ల ఆమోదంతో ఉడాన్ పథకాన్ని మరింత విస్తరించింది. దీని కింద రాబోయే ఏళ్లలో చిన్న నగరాల్లో 100 కొత్త విమానాశ్రయాలు, 200 కొత్త హెలిప్యాడ్‌లు నిర్మితమవుతాయి. దీనివల్ల యూపీకి కూడా ఎంతో మేలు జరుగుతుంది". అని శ్రీ మోదీ అన్నారు.

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగం గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. కొత్త విమానాశ్రయాలు నిర్మిస్తున్న కొద్దీ కొత్త విమానాలకు డిమాండ్ కూడా పెరుగుతోందని, వివిధ విమానయాన సంస్థలు వందల కొద్దీ కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇస్తున్నాయని తెలిపారు. ఇది పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, నిర్వహణ నిపుణులతో సహా యువతకు అపారమైన అవకాశాలను కల్పిస్తుందని ప్రధానమంత్రి చెప్పారు. పెరుగుతున్న ఈ డిమాండ్‌ను తీర్చడానికి "మా ప్రభుత్వం విమానయాన రంగంలో శిక్షణ సౌకర్యాలను కూడా విస్తరిస్తోంది" అని చెప్పారు.

భారత విమానయాన రంగంలో 85 శాతం ఇప్పటికీ నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర తనిఖీ (ఎంఆర్‌ఓ) సేవల కోసం విదేశాలకు వెళ్లాల్సి వస్తోందని ప్రధానమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఆర్‌ఓ రంగంలో కూడా దేశాన్ని స్వయం సమృద్ధం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని, నేడు జేవార్‌లో ఒక ఎంఆర్‌ఓ కేంద్రానికి శంకుస్థాపన జరిగిందని చెప్పారు. "ఇది సిద్ధమైనప్పుడు భారత్, విదేశాల నుంచి వచ్చే విమానాలకు సేవలు అందిస్తుంది. దీనివల్ల దేశానికి ఆదాయాన్ని సమకూరుస్తుంది. మన డబ్బును మన దేశంలోనే ఉంచుతుంది. యువతకు అనేక ఉద్యోగాలను సృష్టిస్తుంది" అని ప్రకటించారు.

పౌరుల సౌకర్యాన్ని నిర్ధారించడం, వారి సమయాన్ని, డబ్బును ఆదా చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మెట్రో, వందే భారత్ వంటి ఆధునిక రైలు సేవల విస్తరణ గురించి మాట్లాడారు." ఢిల్లీ–మీరట్ నమో భారత్ రైలును ఇప్పటికే రెండున్నర కోట్లకు పైగా ప్రయాణికులు ఉపయోగించారు. గంటల సమయం పట్టే ప్రయాణం ఇప్పుడు నిమిషాల్లో పూర్తవుతోంది"అని చెప్పారు.

వికసిత్ భారత్ కోసం ఆధునిక మౌలిక సదుపాయాల రంగంలో మునుపెన్నడూ లేని విధంగా జరుగుతున్న పెట్టుబడులను ప్రధానమంత్రి ప్రస్తావించారు. గత 11 ఏళ్లలో మౌలిక సదుపాయాల బడ్జెట్‌ను ఆరు రెట్లు పెంచినట్లు చెప్పారు. రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల కోసం రూ. 17 లక్షల కోట్లు ఖర్చు చేసి లక్ష కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారులను నిర్మించినట్లు తెలిపారు. 2014కి ముందు 20,000 కిలోమీటర్లుగా ఉన్న రైల్వే విద్యుదీకరణ, నేడు 40,000 కిలోమీటర్లకు పైగా పెరిగిందని, బ్రాడ్ గేజ్ వ్యవస్థను దాదాపు 100 శాతం విద్యుదీకరించామని పేర్కొన్నారు. కాశ్మీర్ లోయ, ఈశాన్య రాష్ట్రాల రాజధానులను తొలిసారిగా రైలు వ్యవస్థతో అనుసంధానిస్తున్నట్లు తెలిపారు.గత దశాబ్ద కాలంలో ఓడరేవుల సామర్థ్యం రెట్టింపు కంటే ఎక్కువ పెరిగిందని అంతర్గత జలమార్గాల సంఖ్య కూడా నిరంతరం పెరుగుతూనే ఉందని పేర్కొన్నారు. "వికసిత్ భారత్ నిర్మాణానికి అవసరమైన ప్రతి రంగంలోనూ భారత్ అత్యంత వేగంగా పనిచేస్తోంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ప్రపంచ సవాళ్ల దృష్ట్యా సమష్టి కృషి, జాతీయ ఐక్యత అవసరమని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల వల్ల తలెత్తుతున్న సంక్షోభాన్ని ఎదుర్కోవడంపై పార్లమెంటులోను, ముఖ్యమంత్రులతోనూ సుదీర్ఘంగా చర్చించినట్లు చెప్పారు. ఈ సంక్షోభాన్ని ప్రశాంతంగా, ఓపికగా ఎదుర్కోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే భారతీయుల గొప్ప బలం అని ఆయన పేర్కొన్నారు "భారతీయుల ప్రయోజనం, దేశ ప్రయోజనాలకు ఏది మంచిదో అదే భారత ప్రభుత్వ విధానం, వ్యూహం" అని ప్రధాని పునరుద్ఘాటించారు. దేశ సమైక్య ప్రయత్నాలకు అన్ని రాజకీయ పార్టీలు బలాన్ని ఇస్తాయని తాను పూర్తి విశ్వాసంతో ఉన్నానని చెబుతూ శ్రీ మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.

## విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడతాయి

### –సీపీ సాయి చైతన్య, ఐపీఎస్

నిజామాబాద్, మార్చి 28: గిరిరాజ్ ప్రభుత్వ (జి.జి.) కళాశాలలో శనివారం క్రీడా విభాగం ఆధ్వర్యంలో క్రీడామహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ సి.పి. సాయి చైతన్య, ఐపీఎస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మనం ఏ స్థాయిలో ఉండాలో, ఎటువంటి సమాజాన్ని కోరుకుంటున్నామో తగిన ప్రణాళికలతో కళాశాల చదువు కొనసాగించాలన్నారు.

చదువు ఎక్కడ నుండైనా కొనసాగించవచ్చని, కానీ కళాశాలకు వచ్చి చదవడం ద్వారా సమాజానికి తగిన విధంగా వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాల దశలో దారి తప్పే ప్రమాదం ఉంటుందని, వ్యసనాలకు గురి కాకుండా క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యవంతంగా ఉండేందుకు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. రామ్ మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల ప్రగతి, అధ్యాపకులు, విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బాలమణిని ప్రత్యేకంగా ప్రశంసించారు. వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాలలో నిరంతరం క్రీడలను నిర్వహించడం గొప్ప విషయమని అభినందించారు. ఈ విద్యా సంవత్సరానికి ఫిజికల్ సైన్స్ విభాగం ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకోగా, కామర్స్ విభాగం ద్వితీయ స్థానంలో నిలిచింది.




ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య రంగరత్నం, పరీక్షల నియంత్రణ అధికారి భరత్ రాజ్, పీఆర్‌ఓ దండు స్వామి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాజేష్, అకడమిక్ కోఆర్డినేటర్ నహీదా బేగం, కామర్స్ విభాగాధిపతి వినయ్ కుమార్, ఏఓ రామ్ కిషన్, సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

## 'వైద్యులపై దాడులు జరగకుండా కఠిన చట్టాలు తేవాలి'

నల్గొండ, మార్చి 28: వైద్యులపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకువచ్చి ఖచ్చితంగా అమలు చేయాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పుల్లారావు, నీలగిరి బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ రమేశ్, సెక్రటరీ డాక్టర్ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం నిర్మల్ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల ఎస్వీఆర్ హాస్పిటల్ లోని సిబ్బంది, డాక్టర్ పై దుండగులు చేసిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ డాక్టర్ కిషన్, సెక్రటరీ డాక్టర్ అశోక్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నీలగిరి బ్రాంచ్ తరపున డాక్టర్లందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మల్ లోని ఎస్వీఆర్ చిన్నపిల్లల హాస్పిటల్ లో డాక్టర్ సంతోష్ రాజ్ సీనియర్ పిల్లల వైద్య నిపుణుడు పేషెంట్ కు ఉన్న జబ్బును నయం చేసి డిశ్చార్జ్ చేసే సమయంలో బిల్లు చెల్లించకుండా డాక్టర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో అతడిపై చేయి చేసుకుని దురుసుగా ప్రవర్తించడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వైద్యులు జార్జి ప్రవీణ్, అనిత, రాణి, విశ్వ జ్యోతి, రామచంద్ర, దేవాదినం, రాజిరెడ్డి, శ్రీనివాస్ రావు, అరుంధతి, పద్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

# పాడి రైతులకు భారీ లాభం

### కృష్ణా మిల్క్ యూనియన్ కీలక నిర్ణయం

### పాల సేకరణ ధర పెంపు, బోనస్ చెల్లింపులు..

### దేశంలోనే అత్యధిక ధర చెల్లిస్తున్న సమితిగా గుర్తింపు..




అమరావతి, మార్చి 28:పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి పెద్ద ఊతమిచ్చే నిర్ణయంగా కృష్ణా మిల్క్ యూనియన్ 36వ సర్వసభ్య సమావేశంలో పాల సేకరణ ధర పెంపుతో పాటు బోనస్ చెల్లింపులపై కీలక నిర్ణయాలు తీసుకుంది. యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతులకు దేశంలోనే అత్యధిక చెల్లింపులు అందిస్తున్నామని ప్రకటించారు. ఈ సర్వసభ్య సమావేశంలో 10% వెన్న గల పాలకు కేజీ ఫ్యాట్‌కు రూ. 30 పెంపుతో రూ. 850గా నిర్ణయించగా, ఆవు పాల టోటల్ సాలిడ్స్‌కు రూ. 20 పెంపుతో రూ. 310గా నిర్ణయించారు. ఈ పెంపు ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి రానుంది. బోనస్‌తో కలిపి కేజీ ఫ్యాట్‌కు రూ. 935 చెల్లించనున్నట్లు వెల్లడించారు.

బోనస్ చెల్లింపుల్లో ముందంజ..

పాడి రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కృష్ణ మిల్క్ యూనియన్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి మూడవ విడతగా డిసెంబర్ 2025 నుంచి మార్చి 2026 వరకు 10% బోనస్ కింద సుమారు రూ. 15 కోట్లు రైతులకు ఏప్రిల్‌లో చెల్లించనున్నట్లు కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. మొత్తం మూడు విడతలుగా రూ. 45 కోట్ల బోనస్ ఇప్పటికే అందించినట్లు వెల్లడించారు.

కృష్ణ మిల్క్ యూనియన్ గత ఏడేళ్లలో గణనీయమైన ప్రగతిని సాధించింది. టర్నోవర్ రూ. 716 కోట్ల నుంచి రూ. 1265 కోట్లకు (77% వృద్ధి) చెరి భారీ వృద్ధి నమోదు చేసింది. మిగులు నిధులు రూ. 96 కోట్ల నుంచి రూ. 250 కోట్లకు చేరడంతోపాటు, స్థిరాస్తులు రూ. 64 కోట్ల నుంచి రూ. 320 కోట్లకు చేరుకున్నాయి. వార్షిక స్థూల లాభం రూ. 75 కోట్ల నుంచి రూ. 137 కోట్లకు పెరిగినట్లు చలసాని ఆంజనేయులు వివరించారు

సేంద్రియ వ్యవసాయం, సోలార్ ప్రాజెక్ట్ దిశగా అడుగులు..

గ్రామాలను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించే దిశగా యూనియన్ చర్యలు తీసుకుంటోందని చలసాని ఆంజనేయులు తెలిపారు. విద్యుత్ వ్యయాన్ని తగ్గించేందుకు 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పశువుల వసతిశాలల ఏర్పాటు వంటి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తున్న నేపథ్యంలో నారా చంద్రబాబు నాయుడు, కొణిదెల పవన్ కళ్యాణ్, కింజరాపు అచ్చెన్నాయుడులకు యూనియన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

రైతు సంక్షేమమే లక్ష్యం..

పాడి రైతుల ఆదాయం పెంపుతో పాటు పశువుల సంరక్షణ, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరింత అభివృద్ధి దిశగా కృషి కొనసాగిస్తామని యూనియన్ అధ్యక్షుడు జలసాని ఆంజనేయులు తెలిపారు. ఈ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యులపై దాడులు హేయం: ఐఎంఏ




నిర్మల్, మార్చి 28: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే 24గంటల పాటు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నామని, అలాంటి తమపైన దాడులు చేయడం హేయనీయమని, జిల్లాకేంద్రంలో పిల్లల వైద్యుడు సంతోష్ రాజ్ పైన దాడి చేయడాన్ని ముక్తకంఠంతో ఖండిస్తున్నామని ఐఎంఏ నిర్మల్ జిల్లా బాధ్యులు, పలువురు వైద్యులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ సంతోష్ రాజ్ పైన జరిగిన దాడిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖండిస్తోందన్నారు.

ఈ దాడిపై రాష్ట్ర, జాతీయ ఐఎంఏ శాఖలు స్పందించాయని చెప్పారు. గంటపాటు ఓపీ సేవలు నిలిపివేసి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు నిరసన తెలుపుతున్నారని చెప్పారు. ఆసుపత్రులలో వైద్యం పొందిన తర్వాత బిల్లులు, ఇన్సూరెన్స్ లు విషయంలో తమకు నిబంధనలు ఉంటాయన్నారు. కేవలం తాము అడిగిన రీయింబర్స్మెంట్ బిల్లులను ఇవ్వనందుకు ఇలా ఓ వైద్యుడిపై దాడి చేయడం అనేది శోచనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను ఎవరు ప్రోత్సహించారని చెప్పారు. వైద్యులు, ఆసుపత్రులపై దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు అవుతాయని, పదేళ్లపాటు జైలు శిక్షతో పాటు అలాగే ఆస్తుల జప్తు వంటి శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

పోలీసులు 24 గంటలలో నిందితులను అరెస్టు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు తాము ఆందోళనను విరమించినట్లు వివరించారు. వైద్యుడిపై జరిగిన దాడికి నిరసనగా తాము చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు అన్నివర్గాల నుంచి మద్దతు లభించిందని, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సహా, ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు జిల్లా ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. వైద్యురాలు రంజిత సంతోష్ రాజ్ మాట్లాడుతూ.. పది రోజుల కిందట ఆసుపత్రిలో నుంచి డిశ్చార్జ్ అయిన వారు రీయంబర్స్మెంట్ కోసం వచ్చారని చెప్పారు. తాము ఇచ్చిన బిల్లుల ప్రకారం కాకుండా రెట్టింపు ఇవ్వడం కుదరదని చెప్పడంతో వారు ముందుగా ఆసుపత్రి సిబ్బందిపై, ఆ తర్వాత వైద్యుడు సంతోష్ రాజు పైన దాడి చేశారని వివరించారు.

అత్యవసర వైద్య సేవలను సైతం అందిస్తున్న తమపై ఇలాంటి దాడులు చేయడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎంఏ నిర్మల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి డాక్టర్ కృష్ణంరాజు, బాధ్యులు డాక్టర్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పగలు రాత్రి అనే తేడా లేకుండా 24గంటల పాటు అందుబాటులో ఉంటూ, చిన్నారులకు వైద్యాన్ని అందించే డాక్టర్ సంతోష్ రాజ్ పైన దాడి చేయడమనేది అమానవీయమన్నారు. నిర్మల్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యావత్ వైద్యులందరూ ఈ ఘటనను ఖండించారని చెప్పారు. పోలీసులు ఇచ్చిన హామీ మేరకు తమ నిరసనను విరమించామని, త్వరలోనే నిందితులను పట్టుకొని చట్ట ప్రకారం శిక్షించాలని మరోసారి డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇకముందు ఐఎంఏ తీసుకునే నిర్ణయాల ప్రకారం తమ కార్యాచరణ ఉంటుందని చెప్పారు. వైద్యుల నిరసనలకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## పెన్‌పహాడ్‌లో ఆరోగ్య శిబిరం

నల్గొండ, మార్చి 28: 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శనివారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి పెండెం వెంకట రమణ సందర్శించి అందిస్తున్న వైద్య సేవలపై రోగులను, వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాల్లో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బంది లభ్యత, మందుల నిల్వలు, వైద్య సేవలపై మండల వైద్యాధికారి రాజేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో మొత్తం 372 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గాజుల చంద్రశేఖర్, తాసీల్దార్ లాలూ నాయక్, సర్పంచ్ ఒగ్గు రవి. డాక్టర్లు మానస, నందిని, సమీరా, కుమార్ నాయక్, యశ్వంత్, అర్చిత,పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో గట్ మైక్రోబయోటా, ప్రోబయోటిక్ సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16వ భారత ప్రోబయోటిక్ సదస్సు

న్యూఢిల్లీ, మార్చి 28:గట్ మైక్రోబయోటా, ప్రోబయోటిక్ సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 27, 28న "గట్ మైక్రోబయోమ్, ప్రోబయోటిక్స్: పుట్టినప్పటి నుంచి వందేళ్ల వృద్ధుల వరకు ప్రభావం" అంశంపై న్యూఢిల్లీలో 16వ భారత ప్రోబయోటిక్ సదస్సును నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నీతి ఆయోగ్ సభ్యులు శ్రీ రాజీవ్ గౌబా ప్రసంగిస్తూ.. రోగనిరోధక శక్తి, జీవక్రియలు, నివారణ ఆరోగ్య సంరక్షణలో గట్ మైక్రోబయోమ్' (పేగులలోని సూక్ష్మజీవుల వ్యవస్థ) కీలక పాత్రను వివరించారు.

దేశంలో ఆహారపు అలవాటలో వేగంగా వస్తున్న మార్పులపై శ్రీ గౌబా ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణీకరణ, మారుతున్న జీవనశైలి, సోషల్ మీడియా, ఆన్‌లైన్ డెలివరీ వేదికల ద్వారా అతిగా ప్రాసెస్ చేసిన, శుద్ధి చేసిన ఆహార పదార్థాల వినియోగం పెరగడం వంటివి ప్రజలను సాంప్రదాయ, పోషక విలువలున్న ఆహారానికి దూరం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ధోరణులు పేగు ఆరోగ్యంపై తీవ్రమైన దీర్ఘకాలిక పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. దేశంలోని సుమారు 56.4 శాతం వ్యాధుల భారం అనారోగ్యకరమైన లేదా అసమతుల్య ఆహారపు అలవాట్ల వల్లే వస్తోందని గుర్తు చేశారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే, "సూక్ష్మ జీవులు స్థూల పరిణామాలకు దారితీస్తాయని" హెచ్చరించారు.

జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని విస్తృతమైన కోణంలో విశ్లేషిస్తూ.. వ్యక్తిగత సంక్షేమానికి,ఆర్థిక వృద్ధికి ఆరోగ్య రంగమే అత్యంత కీలకమైనదని శ్రీ గౌబా అభివర్ణించారు. దేశ జనాభాలో వృద్ధుల శాతం పెరుగుతున్న తరుణంలో ఆరోగ్యవంతమైన శ్రామిక శక్తి, క్రియాశీలకమైన, ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం ముందస్తు సన్నద్ధత ఉంటేనే దేశ జనాభా డివిడెండ్ (పనిచేసే యువత వల్ల కలిగే ప్రయోజనం) సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యంపై పెట్టే పెట్టుబడి వికసిత్ భారత్ కోసం పెట్టే పెట్టుబడి అని గౌబా పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్, పీఎం-జేఏవై, జన్ ఔషధి పరియోజన వంటి పథకాలు ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని గణనీయంగా బలోపేతం చేశాయని తెలిపారు. 2015 నుంచి 2022 ఆర్థిక సంవత్సరాల మధ్య ప్రజలు తమ సొంత జేబుల నుంచి పెట్టే ఆరోగ్య ఖర్చు 62.6 శాతం నుంచి 39.4 శాతానికి తగ్గిందని, దీనివల్ల కుటుంబాలకు దాదాపు రూ. 1.25 లక్షల కోట్ల ఆదా అయ్యిందని చెప్పారు.

ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండటం, సమానత్వం, చౌకగా లభించడం, నాణ్యత, రోగుల భద్రత, నైపుణ్యం కలిగిన ఆరోగ్య నిపుణుల కొరత వంటి సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని శ్రీ గౌబా పేర్కొన్నారు.. ఆరోగ్య సేవలు అందడం అనేది ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అంశాలపై ఆధారపడి ఉందని ఆయన చెప్పారు. ఆరోగ్య నిపుణులు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరుతూ.. సామాన్యులకు అందుబాటులో ఉండే జెనరిక్ మందులను ఎక్కువగా సూచించాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో లేని వారికి నిపుణులు గొంతుకగా నిలవాలని సూచించారు. డిజిటల్ ఆరోగ్య సాధనాలు, టెలిమెడిసిన్, డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధ వంటి సాంకేతికతలను ఉపయోగించి వైద్య సదుపాయాలు సరిగ్గా లేని ప్రాంతాలకు కూడా నిపుణుల చికిత్సను అందించాలని కోరారు.

విస్తరిస్తున్న ప్రోబయోటిక్స్ రంగం గురించి మాట్లాడుతూ.. మైక్రోబయోమ్ సైన్స్ కేవలం వర్ణనాత్మక అధ్యయనాల నుంచి యాంత్రిక, అనువర్తిత పరిశోధనల స్థాయికి చేరుకుందని గౌబా పేర్కొన్నారు. రాబోయే కాలంలో మైక్రోబయోమ్ ఆధారిత చికిత్సలు, సింథటిక్ బయాలజీ, సాంకేతికత ద్వారా ప్రోబయోటిక్ స్ట్రెయిన్స్‌ను అభివృద్ధి చేయడం వంటి కొత్త పోకడలు వస్తాయని ఆయన వివరించారు. ఇవి ఖచ్చితమైన వైద్యం కోసం వాపు నిరోధక, జీవక్రియ విధులను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తాయని తెలిపారు. అయితే ప్రోబయోటిక్స్, సప్లిమెంట్ల మార్కెట్‌లో పెరుగుతున్న తప్పుడు సమాచారం, తప్పుదోవ పట్టించే ప్రకటనల గురించి హెచ్చరించారు. వైద్యులు, పరిశోధకులు తమకున్న విశ్వసనీయతను ఉపయోగించి సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని తెలిపారు. ఖరీదైన పరీక్షలు, శస్త్రచికిత్సల అవసరం లేకుండా నివారణాత్మక జీవనశైలిని ప్రచారం చేయాలని కోరారు. పులియబెట్టిన ఆహారాలు, సాంప్రదాయ ఆహార పద్ధతుల్లో దేశానికి ఉన్న గొప్ప వారసత్వాన్ని శ్రీ గౌబా ప్రస్తావించారు. మన సాంప్రదాయ జ్ఞానాన్ని, ఆధునిక జన్యు, మైక్రోబయోమ్ పరిశోధనలతో అనుసంధానం చేయడం ద్వారా.. శాస్త్రీయంగా ధ్రువీకరించిన ప్రోబయోటిక్స్‌ను అభివృద్ధి చేసి, ప్రపంచ ప్రోబయోటిక్ ఉద్యమానికి నాయకత్వం వహించడానికి దేశానికి అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. అంటు వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల భారాన్ని తగ్గించడంలో, పోషకాహార లోపాలను సరిదిద్దడంలో, ప్రజల రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ప్రోబయోటిక్స్‌కు ఉన్న అపారమైన సామర్థ్యాన్ని ఆయన వివరించారు. శాస్త్రీయ పురోగతిని సురక్షితమైన, సమర్థవంతమైన, అందరికీ అందుబాటులో ఉండే ఉత్పత్తులుగా మార్చడానికి.. విద్యాసంస్థలు, పరిశ్రమలు, నియంత్రణ సంస్థల మధ్య బలమైన సహకారం అవసరమని స్పష్టం చేశారు.

యువ పరిశోధకులు, ఆవిష్కర్తల భాగస్వామ్యాన్ని అభినందిస్తూ.. సంక్లిష్టమైన ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడానికి బహుళ విభాగ, సాక్ష్యాధారాలతో కూడిన విధానాలను అవలంబించాలని శ్రీ గౌబా వారిని ప్రోత్సహించారు. ఈ సదస్సు కొత్త భాగస్వామ్యాలకు నాంది పలుకుతుందని, మైక్రోబయోమ్, ప్రోబయోటిక్ శాస్త్ర రంగాల్లో దేశ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుపతి, మార్చి 28: కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలకు భక్తుల రద్దీ కొనసాగుతుంది . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 30 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.

శుక్రవారం 67,526 మంది భక్తులు దర్శించుకోగా 25,780 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించు కున్న కానుకల వల్ల శ్రీవారి హుండీకి రూ. 3.45 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

**టీటీడీకి రూ.10 లక్షలు విరాళం**

గుంటూరుకు చెందిన డాక్టర్ బాలాజీ గుంటుపల్లి అనే భక్తుడు టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10,00,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

# రైల్వే అధికారుల అనాలోచిత నిర్ణయం : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, మార్చి 28: పట్టణం నడిబొడ్డున నుంచి వెళ్తున్న రైల్వే డబుల్ లైన్‌కోసం అధికారులు తీసుకుంటున్న అనాలోచిత చర్య వల్ల ప్రజలను ఇబ్బందులపాలు చేయవద్దని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు. శనివారం పట్టణంలో రైల్వే అధికారులు చేపట్టిన పనులను పరిశీలించారు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో డబుల్ లైన్ ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తు చేశారు.ఐఅఖీ విజన్

రైల్వే అధికారులు చేపడుతున్న డబుల్ లైన్ పనుల విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదని, కాని అధికారులు అనాలోచితంగా ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. రెండు వైపుల తొమ్మిది ఫీట్ల స్థలం తీసుకుంటే సమస్య లేదని, ఒకవైపు ఎక్కువ, మరోవైపు తక్కువ తీసుకుంటుండడం వల్ల వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు.

పేదల ఆస్తులు కొల్లగొట్టినా ఇబ్బందులు పెట్టినా సహించేది లేదని అవసరమైతే ఢిల్లీకి వెళ్లి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# నిజామాబాద్ బాలికల జూనియర్ కళాశాలకు రాష్ట్ర అవార్డు




నిజామాబాద్, మార్చి 28:నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రాష్ట్ర స్థాయిలో మరో ఉత్తమ కళాశాల అవార్డును అందుకునీ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ శనివారం ఈ అవార్డును స్వీకరించినట్లు జిల్లా విద్యాధికారి రవికుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో హెచ్ఎంటీవీ, హ్యాన్స్ ఇండియా పత్రికల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉత్తమ సేవలు, ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలను ఎంపిక చేసి అవార్డులు అందజేశారు.

ఈ కార్యక్రమం ఆర్టీసీ కళాభవన్‌లో జరిగింది. కార్యక్రమంలో హెచ్ఎంటీవీ, హ్యాన్స్ ఇండియా పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ హనుమంతరావు, ఎడిటర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ మాట్లాడుతూ కళాశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు రావడం గర్వకారణమన్నారు. కళాశాల అభ్యున్నతికి అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. ఈ అవార్డు కళాశాలపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ అవార్డును బోధన, బోధనేతర సిబ్బందికి అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# వృద్ధుల దంపతులపై దాడి కేసు.. 48 గంటల్లోనే నిందితుడి అరెస్ట్




మెదక్, మార్చి 28:శంకరంపేట-ఆర్ మండలంలోని జంగరాయి గ్రామంలో వృద్ధ దంపతులపై పట్టపగలు దాడి చేసి దోపిడీకి పాల్పడిన సంచలన కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి సుమారు 4¼ తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. 48 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం జంగరాయి గ్రామానికి చెందిన తమ్మల నర్సింలు (48) ఫిర్యాదు ప్రకారం.. ఈ నెల 25న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి ముసుగు ధరించి వారి ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులు తమ్మల అంజయ్య (85), సావిత్రమ్మ (80)పై ఇనుప రాడ్డుతో దాడి చేసి, వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.

సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుడిని గుర్తించారు. శనివారం (28న) ఉదయం 9 గంటలకు తూప్రాన్ బస్ స్టాప్ వద్ద వరిగే వెంకట నారాయణ (40)ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల వాసి కాగా.. ప్రస్తుతం తూప్రాన్‌లో నివాసం ఉంటున్నాడు. నిందితుడి వద్ద నుంచి 2¼ తులాల బంగారు పుస్తెల తాడు, 1¼ తులాల గొలుసు, అర్ధ తులం బంగారు ఉంగరం, అలాగే నేరానికి వినియోగించిన ఎూ చీఓ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 4¼ తులాల బంగారం రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్పులు తీర్చుకోవడం కోసం..

దర్యాప్తులో నిందితుడు అప్పులు తీర్చుకోవడం కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ దోపిడీకి పాల్పడినట్లు వెల్లడైంది. బాధితులు తనకు పరిచయం ఉన్న బంధువులేనని తెలిసినా, ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించి పథకం ప్రకారం నేరానికి పాల్పడినట్లు పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచనలతో రామాయంపేట సీఐ వెంకట్ రాజా గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కృషి చేసి కేసును ఛేదించాయి. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో ప్రజలు అపరిచితులపై నమ్మకం ఉంచకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

# నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో కబరస్తాన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మం, మార్చి 28: బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామ పంచాయతీలో ముస్లింల స్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు, కబరస్తాన్ చుట్టూ ప్రహారీ నిర్మాణానికి ఐటీసీ సీఎస్ఆర్ నిధులు రూ.30 లక్షలతో చేపట్టే నిర్మాణ పనులకు సర్పంచ్ బానోత్ సరోజ శనివారం శంకుస్థాపన చేశారు. ముస్లింల ఇబ్బందులను గమనించి సీఎస్ఆర్ నిధులతో ఈ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఐటీసీ మేనేజర్ విశ్వనాథం, బీఆర్ఎస్ నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, దారం కృష్ణారెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు వేడగం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు బుస్కాని నరేశ్, ఇమడబత్తిన రామకృష్ణ, ఎడమకంటి పిచ్చిరెడ్డి, యారం వెంకట్రామిరెడ్డి, మొండెద్దుల వెంకటేశ్‌రెడ్డి, బానోత్ రామదాసు, మాజీ సర్పంచ్ బానోతు కృష్ణ, నాగిరెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి, నరేశ్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# హరిత ఓడరేవులు మరియు సముద్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 28:ఓడరేవులు, నౌకాయానం మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ, మారిటైమ్ ఇండియా విజన్ 2030 మరియు 'హరిత్ సాగర్' గ్రీన్ పోర్ట్ మార్గదర్శకాల క్రింద, సాంప్రదాయ డీజిల్-శక్తితో నడిచే టగ్‌ల నుండి ఎలక్ట్రిక్/హైబ్రిడ్ టగ్‌లకు మారడానికి గ్రీన్ టగ్ ట్రాన్సిషన్ ప్రోగ్రామ్ అమలు, ఓడరేవులలో పునరుత్పాదక శక్తిని స్వీకరించడం, ఓడరేవు పరికరాలు, వాహనాలు మరియు రైల్వే ట్రాక్‌ల విద్యుదీకరణ, సున్నా-ఉద్గార ట్రక్కుల విస్తరణ, మరియు తీరప్రాంత విద్యుత్ సరఫరా వ్యవస్థ ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను చేపట్టింది. నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ కూడా గుజరాత్‌లోని దీన్‌దయాల్ పోర్ట్ అథారిటీ, ఒడిశాలోని పారాదీప్ పోర్ట్ అథారిటీ, మరియు వి.ఓ. తమిళనాడులోని చిదంబరనార్ పోర్ట్ అథారిటీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లుగా ఉన్నాయి. ప్రధాన ఓడరేవులు కేంద్ర ప్రభుత్వ పరిపాలనా నియంత్రణలో ఉంటాయి మరియు అన్ని ప్రధాన ఓడరేవులు పునరుత్పాదక శక్తి, తీరం నుండి ఓడకు విద్యుత్ సరఫరా మొదలైన వాటి కోసం చొరవ తీసుకున్నాయి. ప్రధాన ఓడరేవులు కాని ఇతర ఓడరేవులు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనా నియంత్రణలో ఉంటాయి మరియు వాటి అభివృద్ధి రాష్ట్ర అధికార పరిధి మరియు బాధ్యత పరిధిలోకి వస్తుంది.

# వికటించిన విందు భోజనం..41 మందికి అస్వస్థత



మెదక్, మార్చి 28: విందు భోజనం వికటించి 41 మందికి అస్వస్థతయిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో చోటుచేసుకుంది. నర్సాపూర్ లో శుక్రవారం సాయంత్రం హవేజ్ అనే వ్యక్తి కుటుంబానికి చెందిన హల్ది ఫంక్షన్ నిర్వహించారు. కార్యక్రమానికి అవేజ్‌కి చెందిన బంధుమిత్రులు, కుటుంబీకులు 70 మందిపాల్గొని ఉత్సాహంగా గడిపారు.

అనంతరం ఏర్పాటు చేసిన విందులో అందరూ కలిసి భోజనం చేశారు. అనంతరం అందులో 41 మంది వాంతులు విరోచనాలు చేసుకోవడంతో వారిని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అందులో ముగ్గురు చిన్నారులు ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఇద్దరిని సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ పావని మాట్లాడుతూ అర్ధరాత్రి 12 తర్వాత వరుస పెట్టి వాంతులు విరోచనాలతో ఆస్పత్రికి రాగా కొంతమందికి చికిత్స నిర్వహించి పరిస్థితి మెరుగుపడిన తర్వాత ఇంటికి పంపించినట్లు తెలిపారు. మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫంక్షన్ జరిగిన ప్రాంతానికి ఫుడ్ ఇన్స్పెక్టర్ వెళ్లి ఫుడ్ శాంపిల్ సైతం సేకరించినట్లు తెలిపారు.

# నేపాల్ నూతన ప్రధాని బాలెన్ షాకు అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ..

న్యూఢిల్లీ, మార్చి 28:నేపాల్ నూతన ప్రధానిగా బాలెన్ షా శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు అభినందనలు తెలిపారు. బాలెన్ షా ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఆయన నాయకత్వంపై నేపాల్ ప్రజలకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుందన్నారు.

పరస్పర సహకారం, స్నేహం ద్వారా ఇరు దేశాల ప్రజలకు మేలు జరిగేలా బాలెన్ షా నాయకత్వంలో ఇండియా, నేపాల్ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఎదురుచూస్తున్నట్లు మోదీ తెలిపారు. ఎక్స్ వేదికగా మోదీ ఈ ట్వీట్ చేశారు. మోదీ అభినందనలకు నేపాల్ ప్రధాని బాలెన్ షా స్పందించారు. తనకు అభినందనలు తెలిపిన మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఇరు దేశాల ప్రజల మేలు కోసం మోదీతో కలిసి పని చేసేందుకు ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బాలెన్ షా ఆధ్వర్యంలోని పార్టీ భారీ మెజారిటీతో గెలుపొందింది.

శుక్రవారం బాలెన్ షా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఆధ్వర్యంలో ప్రధాని ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది.

# గట్ మైక్రోబయోటా మరియు ప్రోబయోటిక్ సైన్స్ ఫౌండేషన్ న్యూఢిల్లీలో 16వ ఇండియా ప్రోబయోటిక్ సింపోజియంను నిర్వహిస్తోంది

న్యూఢిల్లీ, మార్చి 28:గట్ మైక్రోబయోటా మరియు ప్రోబయోటిక్ సైన్స్ ఫౌండేషన్, "గట్ మైక్రోబయోమ్ మరియు ప్రోబయోటిక్స్: పుట్టినప్పటి నుండి వందేళ్ల వయసు వరకు ప్రభావం" అనే అంశంపై 16వ ఇండియా ప్రోబయోటిక్ సింపోజియంను 2026 మార్చి 27-28 తేదీల లో న్యూఢిల్లీలో నిర్వహించింది.

ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, నీతి ఆయోగ్ సభ్యులు శ్రీ రాజీవ్ గౌబా, రోగనిరోధక శక్తి, జీవక్రియ మరియు నివారణ ఆరోగ్య సంరక్షణలో గట్ మైక్రోబయోమ్ యొక్క కీలక పాత్రను నొక్కి చెప్పారు. భారతదేశంలో ఆహారపు అలవాట్లలో వేగంగా వస్తున్న మార్పుల పట్ల శ్రీ గౌబా ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణీకరణ, మారుతున్న జీవనశైలి, మరియు సోషల్ మీడియా, శీఘ్ర వాణిజ్య వేదికల ద్వారా ఎక్కువగా ప్రోత్సహించబడుతున్న అతిగా ప్రాసెస్ చేయబడిన మరియు శుద్ధి చేసిన ఆహార పదార్థాల వినియోగం పెరగడం వంటివి ప్రజల ను సాంప్రదాయ, పోషక విలు వలు అధికంగా ఉండే ఆహారా లకు దూరం చేస్తున్నా యని ఆయన పేర్కొన్నారు. ఈ ధోరణు లు పేగు ఆరోగ్యంపై తీవ్రమైన దీర్ఘకాలిక పరిణామా లకు దారితీయవచ్చని ఆయన హెచ్చ రించారు. భారతదేశంలోని వ్యాధి భారంలో సుమారు 56.4% అనారోగ్యకరమైన లేదా అసమ తుల్యమైన ఆహారపు అలవాట్ల వల్లేనని ఆయన నొక్కి చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే, "సూక్ష్మ జీవులు స్థూల పరిణా మాలను సృష్టించగ లవు" అని ఆయన ఇం కా హెచ్చరించారు. జీర్ణవ్యవస్థ ఆరో గ్యాన్ని విస్తృత అభివృద్ధి సందర్భంలో ఉంచుతూ, వ్యక్తిగత శ్రేయస్సు మరియు ఆర్థిక వృద్ధి రెండింటికీ ఆరోగ్య సంరక్షణ అత్యంత కీలకమైన రంగమని శ్రీ గౌబా అభివర్ణించారు. జనాభాలో వృద్ధుల వాటా పెరుగు తున్నందున, ఆరోగ్యకరమైన శ్రామిక శక్తి మరియు చురుకైన, ఆరోగ్య కరమైన వృద్ధాప్యానికి సకాలంలో సిద్ధపడటం ద్వారా మాత్రమే భారతదేశ జనాభా డివిడెండ్‌ను సాకారం చేసుకోగలమని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యంపై పెట్టు బడి అంటే విక్సిత్ భారత్‌పై పెట్టు బడేనని ఆయన నొక్కి చెప్పారు మరియు ఆయుష్మాన్ భారత్, పీఎం-జేఏవై, పీఎం భారతీయ జనౌషధి పరియోజన మరియు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల వంటి కార్యక్రమాలు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను, ఆర్థిక రక్షణను గణనీయంగా బలోపేతం చేశాయని ఉదహరించారు.

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక జమలాపురం కేశవరావు

నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతుకుతున్న వారి స్వేచ్ఛకోసం, తమ జీవితాన్ని త్యజించిన వారిలో 'సర్దార్ జమలాపురం కేశవరావు'ముందు వరుసలో నిలుస్తారు..

కట్టెదుట జరుగుతున్న అన్యాయాలకు చూస్తూ, సహిస్తూ ఉండలేక ప్రజల్లో ధైర్య సాహసాలను నూరిపోయడమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం మందుకు సాగారు. హైదరాబాద్ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి జీవంపోసి, ప్రజా శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిబద్ధత కలిగిన నేత, త్యాగశీలి సర్దార్ జమలాపురం కేశవరావు. సత్యాగ్రహిగా, క్విట్ ఇండియా ఉద్యమ కార్యకర్తగా, ఆంధ్రమహాసభ నిర్వాహకుడిగా, గ్రంథాలయోద్యమ నిర్మాతగా, ఆదివాసీ, దళిత జనోద్ధారకుడిగా, పత్రిక స్థాపకుడిగా ఇలా కొన్ని ఎన్నో కార్యకలాపాలు చేపట్టి హైదరాబాద్ రాజ్య ప్రజల్లో చైతన్యాన్ని, ధైర్యాన్ని నింపిన మహోన్నతుడు కేశవరావు. అందుకే ఆయన్ను అందరూ తెలంగాణ 'సర్దార్'గా పిలుచు కుంటారు.

తెలంగాణ కేసరిగా, 'దక్కన్ సర్దార్'గా బిరుదులందుకున్న జమలాపురం కేశవరావు తనదైన శైలిలో ఉద్యమాలు నడిపి కాంగ్రెస్‌కు, తెలుగు వారి ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోశారు.

దక్కన్ సర్దార్‌గా, ఉక్కు మనిషిగా ప్రజలు పిలుచుకునే కేశవరావు నిజాం సంస్థానంలో తూర్పు భాగాన ఉన్న ఖమ్మం (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908, సెప్టెంబర్ 3 న జమలాపురం వెంకట రామారావు, వెంకట నరసమ్మలకు తొలి సంతానంగా జన్మించారు. సంపన్న జమిందారీ వంశంలో పుట్టినా, నాటి దేశ రాజకీయాలు అతనిని తీవ్రంగా కలవర పరచాయి. ఎర్రుపాలెం లో ప్రాథమిక విద్య అనంతరం, హైదరాబాదులోని నిజాం కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. వందేమాతరం గీతాలాపనను నిషేధించి నందుకు నిరసనగా, కళాశాల విద్యార్థులను కూడగట్టి, నిరసనోద్యమంలో కాలూనారు. గీతాన్ని ఆలాపించ నివ్వకపోతే తరగతులకు హాజరు కాబోమని హెచ్చరించారు. దీంతో చివరకు నిజాం పాలకవర్గం నిషేధాన్ని ఎత్తివేయక తప్పలేదు. ఈఘటన తర్వాత కేశవరావు ఆలోచనా పరిధి మరింత విస్తృతం అయింది. నిజాం పాలనలో కొనసాగుతున్న వెట్టి చాకిరితో అష్టకష్టాలకు గురవుతున్న ప్రజలను చూసిన కేశవరావు చలించి పోయారు. ప్రజలను విముక్తం చేయడానికి తెలంగాణ జిల్లాల్లో...ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కేశవరావు కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలోనే భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల, గాంధీ సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితుడయ్యారు.

1923లో రాజమండ్రిలో మొదటిసారి మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు, 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనాడు. ఆంధ్రపితామహుడుగా మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయ ఉద్యమంను తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు నడపడంలో కేశవరావు కృషి చేశారు. అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపడానికి ప్రత్యేక శ్రద్ధను కనపరిచేవారు. 1938లో దీపావళి సందర్భంగా ఆవిర్భవించిన 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కేశవరావు కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు. 1938 సెప్టెంబర్ 24 మధ్యాహ్నం మధిరలో గోవిందరావు నానక్, జనార్దనరావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లో సర్దార్‌ను దీక్ష చేయనివ్వొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి నివ్వలేదు. మధిరలో అడుగడుగునా పోలీసులను మోహరించింది. అయినా భారీ సంఖ్యలో ప్రజలు దీక్ష వేదిక దగ్గరకు చేరుకున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు.



మార్చి 29...తెలంగాణ సర్దార్ వర్ధంతి

వెంటనే మహాత్మాగాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జై అని దిక్కులు పెక్కటిల్లేలా నినాదించారు. అరెస్టు చేసి నిషేధాన్ని ఉల్లఘించి సత్యాగ్రహ దీక్ష చేశారంటూ కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైలులో ఎనిమిది నెలల శిక్షను అనుభవించిన తర్వాత కేశవరావుతో సహా రాజకీయ ఖైదీలందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా అదే పోరాట పంథాను కేశవరావు కొనసాగించారు. అంటరానితనం నిర్మూలించేందుకు, ఆదివాసీల అభివృద్ధికి కూడా ఉద్యమం చేశారు.

1942లో కాంగ్రెస్ పిలుపు మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరూరా ప్రచారం చేసే బాధ్యత వహించారు. 1946లో మెదక్ జిల్లా కందిలో కేశవరావు అధ్యక్షతన జరిగిన 13వ ఆంధ్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మాండమైన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. 1947 ఆగస్టు 7న మధిరలో స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహం మరువలేనిది. దానికి బాధ్యుడైన కేశవరావుకు ప్రభుత్వం రెండు సంవత్సరాలు కారాగార శిక్ష విధించింది. యావత్ భారత దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చు కోవడానికి ఉవ్విళ్లూరుతున్న సందర్భంలో కేశవరావు వంటి నాయకులు నిర్భంధానికి గురికావడం ఒక విషాదం. నిజాం సంస్థానం భారత దేశములో విలీనమైన తరువాత, 1952లో కేశవరావు రాజ్యసభకు ఎన్నికయ్యారు.

హైదరాబాద్‌పై పోలీసు చర్య అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలను తీవ్రంగా నిరసించిన మొట్టమొదటి కాంగ్రెస్ వ్యక్తి కేశవరావు. అప్పటి మిలిటరీ అధికారి నంజప్పను నిలదీసిన నిజమైన ప్రజానాయకుడు సర్దార్. కాంగ్రెస్ పార్టీలో ఉండి జాగీర్దార్లను, జమిందార్లను విమర్శించమంటే ఆనాడు నిజంగా ఒక సాహసమే. నంజప్ప నేతృత్వంలో మిలిటరీ వారు కమ్యూనిస్టుల ఏరివేత పేరిట జరిగిన హింసా కాండను, ముస్లిముల ఊచకోతను కేశవరావు ఖండించారు. ప్రజల పక్షాన నిలిచారు. "మనం ఏ ప్రభుత్వాన్ని అయినా సరే అది రాష్ట్ర, జాతీయ ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వం అయినా, కాంగ్రెసు కాని ప్రభుత్వం అయినా అమాయక ప్రజలపై అత్యాచారాలు జరపడాన్ని సహించబోము. నంజప్ప మన ప్రభుత్వంలో ఒక అధికారి మాత్రమే. యింకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన మన ప్రజలకు సేవకుడు. ఆయన యధేచ్ఛగా ప్రవర్తించడానికి, మేము అనుమతించడానికి సిద్ధముగా లేము. ఆయన చేస్తున్న అకృత్యాలు నిజాం తొత్తులైన జాగీర్దార్లను, నాజీ హిట్లరును తలదన్నిన నిజాంను మరిపిస్తున్నది. నంజప్ప తెలంగాణ రక్షకుడిగా కాక, భక్షకుడిగా వచ్చినట్లు అనిపిస్తున్నది." అని డోర్నకల్లులో జరిగిన సభలో కేశవరావు ఎలుగెత్తి చాటారు.

సర్దార్ కేశవరావు భాషారాష్ట్ర సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకి. తెలంగాణ అస్తిత్వాన్ని స్థిరీకరించాలని కోరుకున్నారు. కన్నడ, మరాఠీ భాషా ప్రాంతాలతో కలిసి పోయిన హైదరాబాద్ రాష్ట్రం అలాగే ఉండాలని వాంచించారు. అలాగే జమిందారి, జాగిర్దారీ వ్యవస్థలతో అతలాకుతలమైన తెలంగాణను విశాలాంధ్రలో కలిపినట్లయితే ఏమాత్రం మేలు జరగదని నొక్కి చెప్పారు. విద్యాపరంగా, సామాజిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయకుండా విశాలాంధ్ర ఏర్పాటు వల్ల స్థానికులపై స్థానికేతరుల అజమాయిషీ ఆరంభ మవుతుందని ముందుగానే ఊహించిన అనుభవశాలి ఆయన.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ సభలు, సమావేశాలు జరిగినపుడు ఒక సామాన్య కార్యకర్త మాదిరిగా పందిళ్ళు వేయడానికి, కర్రలు కూడా నాటి నిరాడంబరతకు, పార్టీ పట్ల అంకితభావంకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, అంతలా పార్టీకి సేవ చేసిన ఆయనకు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల మూలంగా రావాల్సినంత పేరు, దొరకాల్సిన గౌరవం రాలేదు. చేపట్టిన ప్రతి ఉద్యమం లోనూ విజయాల్ని సాధించిన ఆయన స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు ద్రోహం చేశారు. ఆయన ఎదుగుదలను అడ్డుకున్నారు. ఎన్నికల్లో ఓటమి చెందేలా పరిస్థితులు కల్పించారు.

జైలు జీవితం, ఉద్యమ సమయంలో భోజనం లేకపోవడం, పార్టీలోని నాయకులు చేసిన మోసం, కలగలిసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయిన కేశవరావు1953, మార్చి 29న తన 46వ ఏట మరణించారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# సీతారాముడి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి

## - పంచముఖ ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్



రాజన్న సిరిసిల్ల, మార్చి 28: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణ కేంద్రంలోని గాంధీనగర్ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ సీతా రామ చంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్, ఫౌండర్ సభ్యులు ఒడ్డాల ప్రకాశం, ట్రస్ట్ కమిటీ సభ్యులు కొండ కనుకయ్యల ఆధ్వర్యంలో ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు.రెండు దశాబ్దాలుగా ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య మాట్లాడుతూ లోక కళ్యాణార్థం గత 20 ఏళ్లుగా (రెండు దశాబ్దాలుగా) గాంధీనగర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారామ కళ్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కళ్యాణ వేడుకను తిలకించడానికి వేములవాడ పట్టణంతో పాటు నుదూర ప్రాంతాల నుండి సుమారు మూడు వేల మంది భక్తులు తరలివచ్చారు. ముఖ్యంగా మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్త ఆంజనేయ భజన మండలి సభ్యుల సహకారంతో వచ్చిన భక్తులందరికీ ప్రసాద వితరణ, భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్, నిర్మాణ కమిటీ సభ్యులైన నర్సయ్య, తీగల రవీందర్ గౌడ్, తీగల మల్లికార్జున్, కూరగాయల కొమురయ్య, మల్లేశం, కొమ్మ శంకర్, తుపుకారి సత్తయ్య, ఆకుల శ్రీనువాసు, డాక్టర్ రవీందర్, గాండ్ల దేవరాజు, సంజీవ్, నార్ల రాజేశం, చిర్లవంచ లక్ష్మీరాజం, టోపీల రమేష్ తదితరులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.

# సిరిసిల్ల జిల్లాలో ఉపాధి హామీ పనుల కల్పనలో వైఫల్యం

## - కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శ

రాజన్న సిరిసిల్ల, మార్చి 28: నేటినిజం (ప్రతినిధి): కంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ ఏటా 125 రోజుల ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పథకాన్ని తీసుకొచ్చినా, సిరిసిల్ల జిల్లాలో సగటున 50 రోజుల పాటు కూడా పనులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. శనివారం జిల్లాలో పర్యటించిన ఆయన తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అంకిరెడ్డిపల్లె గ్రామంలో రూ.25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, ముస్తాబాద్‌లో రూ.10 లక్షలతో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అంతకుముందు గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్, జిల్లాలో సుమారు 92 వేల జాబ్ కార్డులు ఉన్నప్పటికీ, చాలా మందికి 50 రోజులలోపు మాత్రమే ఉపాధి లభిస్తోందని తెలిపారు. కేవలం 6 వేల కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పని దొరికిందన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి 125 రోజుల పని కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.95,692 కోట్లు కేటాయించామని, గ్రామీణాభివృద్ధి బడ్జెట్‌లో 40 శాతం నిధులు ఈ పథకానికేనని చెప్పారు. తెలంగాణకు ఈ పథకం కింద రూ.3 వేల కోట్లకు పైగా నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. మొత్తం వ్యయంలో 60 శాతం నిధులను కేంద్రం విడుదల చేస్తుండగా, రాష్ట్రం తన 40 శాతం వాటాను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని సూచించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన, పంచాయతీలు మరియు మున్సిపాలిటీల అభివృద్ధికి సరిపడ నిధులు కేటాయించడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల



సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బిఈ సందర్భంగా దేశవ్యాప్తంగా జరిగిన శ్రీరామనవమి వేడుకలను ప్రస్తావిస్తూ, ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

# చెక్కపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో విత్తన బంతుల తయారీ



రాజన్న సిరిసిల్ల, మార్చి 28: నేటినిజం (ప్రతినిధి): అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అడవులను సంరక్షించడంలో భాగంగా విత్తన బంతులు ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చని చెట్ల విస్తరణకు విత్తన బంతుల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని 1000కి పైగా విత్తన బంతులను తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకిని కిషన్ మాట్లాడుతూ సీడ్ బాల్స్ అడవుల పెంపొందింపులో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విత్తన బంతులు తయారు చేసిన విద్యార్థులు, నేషనల్ గ్రీన్ కోర్ గైడ్ టీచర్ దూస సంతోష్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా రక్షకులే భక్షకులయ్యారు

## - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

## -అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై ఆది శ్రీనివాస్ తీవ్ర విమర్శలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 28: నేటినిజం (ప్రతినిధి): అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. రాఘవ కన్స్ట్రక్షన్ అంశంపై వ్యక్తిగత ద్వేషంతో మాట్లాడటం సరికాదని ఆయన పేర్కొన్నారు.సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఒకే సంస్థపై పదేపదే ఆరోపణలు చేయడం సభా ప్రమాణాలకు విరుద్ధమని ఆది శ్రీనివాస్ అన్నారు. ఏదైనా సంస్థ తప్పు చేసి ఉంటే చట్టపరంగా పై అధికారు లకు ఫిర్యాదు చేయాలని, కానీ సభను తప్పుదోవ పట్టించేలా వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదని సూచించా రు. సభలో రూల్ పొజిషన్‌ను పాటిస్తూ ఆధారాలతో మాట్లాడాలని ఆయన హితవు పలికారు. సభలో ఇచ్చిన సమయాన్ని రాజకీయ విమర్శలకు వినియోగించడం బాధాకరమని వ్యాఖ్యానించారు. సభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సభ్యులందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ పాలనపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో ప్రజా రక్షకులే భక్షకుల



య్యారని, అందుకే ప్రజలు వారికి గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు.ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపిం చారు. మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ వంటి అభివృద్ధి పనులపై అనవసర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. అలాగే సీఎం కప్ వంటి క్రీడా ప్రోత్సాహక కార్యక్రమాలపై కూడా విమర్శలు చేయడం బాధాకర మన్నారు. బీఆర్ఎస్ నాయకుల వైఖరిపై ఘాటుగా స్పందించిన ఆయన, వారు ఫామ్ హౌస్ రాజ కీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నా రని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, క్రీడలు, ప్రజా సంక్షేమ ంపై దృష్టి సారిస్తోందని చెప్పా రు.సభలో బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# వేములవాడ గౌడ సత్రం సేవలు తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శం

## -కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

రాజన్న సిరిసిల్ల, మార్చి 28: నేటినిజం (ప్రతినిధి): వేములవాడలో పట్టణంలో నిర్వహిస్తున్న అఖిల భారత శ్రీ రాజరాజేశ్వరి రేణుక ఎల్లమ్మ గౌడ నిత్య అన్నదాన సత్రం సేవలు యావత్తు తెలంగాణ రాష్టానికి ఆదర్శమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. కల్మషం లేని మనసుతో చేస్తున్న ఈ సేవలను గౌడ కుల బాంధవులు విస్తృతంగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం కరీంనగర్ పట్టణంలోని శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయంలో గౌడ సత్రం చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని గౌడ కులస్తుల అభ్యున్నతికి కట్టుబడి సినీ నటుడు డాక్టర్ సుమన్ సారథ్యంలో వేములవాడలో గౌడ సత్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించేందుకు వచ్చే గౌడ భక్తులకు నిత్యం అన్నదాన సేవలు అందించే ఈ సత్రం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా




నిలుస్తుందనీ పేర్కొన్నారు.తెలంగాణలో గౌడ సత్రం ద్వారా భక్తులకు నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు సాధించడం అభినందనీయమన్నారు.ఇంత గొప్ప సేవా కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో సత్రం సమర్థవంతంగా నడవడం గర్వకారణమని తెలిపారు.భవిష్యత్తులో ఈ సత్రానికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.చిన్న వయసులోనే గౌడ సమాజానికి విశేష సేవలు అందిస్తున్న మహంకాళి శ్రీనివాస్ గౌడ్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు.రానున్న రోజుల్లో ఈ సత్రం మరింత విస్తరించి మరెన్నో సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చెన్నమనేని వికాస్ రావు,కాశి పీఠాధిపతి శ్రీమాన్,బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు రేగుల మల్లికార్జున్,బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోల కృష్ణస్వామి,రాష్ట్ర నాయకులు దాది అశోక్,గౌడ సత్రం డైరెక్టర్లు సురగౌని రాజు,భైరవుని దేవయ్య, అబ్బ గౌని సురేష్,రావుల రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com